




Truth of News
RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS
irspublications12@gmail.com



సంపుటి: 01 | అనంతపురం | సంచిక : 272 | శనివారం 11 ఏప్రిల్ 2026 | పేజీలు : 08 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


39,436 కోట్లు..

# 31ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్

- 60కి పైగా ఎజెండా అంశాలకు కేబినెట్ ఆమోదం
- అమరావతికి చట్టబద్ధత.. ప్రధాని మోడీకి ధన్యవాదాలు తెలిపిన మంత్రి మండలి
- క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టుల్లో భాగంగా 3 సంస్థలకు కేబినెట్ ఆమోదం
- క్యాబినెట్ ఎజెండా అంశాలు ముందుగా లీకులపై సీఎం ఆగ్రహం
- ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



**అమరావతి-సూర్య వాస్తవం :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశం కీలక నిర్ణయాలతో ముగిసింది. సచివాలయంలో దాదాపు 3 గంటలకు పైగా కేబినెట్ భేటీ కొనసాగగా.. ముఖ్యంగా రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోడీకి మంత్రి మండలి ధన్యవాదాలు తెలియజేసింది. ఈ సమావేశంలో 16వ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో చర్చించిన పలు పెట్టుబడి ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం రూ.39,436 కోట్ల విలువైన 31 ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఈ ప్రాజెక్టులు రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడనున్నాయి. క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టుల్లో

మిగతా 2లో



## మహిళా రిజర్వేషన్లపై ఏకపక్ష ధోరణి

**- ప్రతిపక్షాల విజ్ఞప్తులను విస్మరించిన ప్రభుత్వం - కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ విమర్శ**

**న్యూఢిల్లీ బ్యూరో:** మహిళా రిజర్వేషన్‌పై మోడీ ప్రభుత్వం 'ఏకపక్ష' ధోరణి ప్రదర్శిస్తూ ప్రతిపక్షాల విజ్ఞప్తులను విస్మరించిందని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ విమర్శించింది. శుక్రవారం నాడిక్కడ కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం (ఇందిరా భవన్)లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యూసీ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన, ప్రభుత్వ ప్రతిపాదనలపై చర్చించారు. అలాగే అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతలు, భారతదేశంపై వాటి ప్రభావం, భారత్ అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై తీర్మానాన్ని సీడబ్ల్యూసీ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ చట్టాన్ని సవరించి, పార్లమెంటరీ సీట్ల సంఖ్యను పెంచాలన్న నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వ ప్రతిపాదిత చర్య ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడమేనని విమర్శించారు. ఈ విషయంలో ప్రతిపక్షం ఐక్యంగా ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. " ఈ సమావేశం అనంతరం, ప్రతిపక్షంలోని సహచరులందరితోనూ ఈ అంశాలపై చర్చించి ఓ సమిష్టి వ్యూహాన్ని రూపొందిస్తాం. అంతా ఐక్యంగా ముందుకు సాగుతాం" అని ఖర్గే అన్నారు. ఏప్రిల్ 16 నుంచి 18 వరకు జరగనున్న ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల సమయంపై కూడా ఆయన ప్రశ్నించారు. ఎన్నికల ప్రయోజనాలు, రాజకీయ లబ్ధి కోసమే ఇవన్నీ జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. "మోడీ ప్రభుత్వం కేవలం రాజకీయ లబ్ధి పొందాలనే ఉద్దేశంతోనే పార్లమెంట్ సమావేశాలను నిర్వహిస్తోంది. రాజ్యాంగ సవరణ బిల్లును అత్యంత తొందరగా ఆమోదింపజేయాలని ఆసక్తిగా ఉంది" అని ఖర్గే విమర్శించారు. ప్రతిపాదిత సవరణలు దేశ ఎన్నికల వ్యవస్థపై గణనీయమైన ప్రభావం చూపుతాయి. కావున వాటిపై 'లోతైన చర్చ' అవసరమని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు కేంద్రం నుంచి అధికారికంగా ఎటువంటి ప్రతిపాదన కాంగ్రెస్ ముందుకు రాలేదని తెలిపారు. మహిళా రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. "మాకు ఇప్పటి వరకు అందిన సమాచారం ప్రకారం, 2029 ఎన్నికల నుంచి మహిళా రిజర్వేషన్‌ను అమలు చేయాలని ప్రభుత్వం కోరుకుంటోంది. లోక్‌సభలోని సీట్ల సంఖ్యను 543 నుంచి 816కు పెంచాలని కూడా భావిస్తోంది" అని ఖర్గే అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై ఆందోళన వ్యక్తం చేస్తూ "ఈ పునర్విభజన ప్రతిపాదన తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది. అందువల్ల, పునర్విభజనపై లోతైన చర్చ జరగాల్సిన అవసరం ఉంది" అని అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో పోలింగ్ ముగిసిన తరువాత అఖిలపక్ష సమావేశం నిర్వహించాలన్న ప్రతిపక్షాల అభ్యర్థనను ప్రభుత్వం పట్టించుకోలేదని

మిగతా 2లో

## రాజధాని రగడ.. ఆగేదెలా



**గుంటూరు-సూర్య వాస్తవం:** అమరావతికి ముందు ఓకే అన్నారు. ఆ తర్వాత మూడు రాజధానుల స్లోగన్ అందుకు న్నారు. అది వర్కౌట్ కాలేదు. అంతటితో ఇష్యూ క్లోజ్ అయింద నుకుంటే.. మావిగన్ అంటూ కొత్త స్లోగన్ అందుకున్నారు వైసీపీ అధినేత జగన్. ఉత్తరాంధ్ర వైసీపీ నేతల వాదన అయితే ఇంకా డిఫరెంట్. అమరావతి పేరుతో ఒకే దగ్గర అభివృద్ధి చేస్తే ఎలా అని ధర్మాన..అమరావతికి వ్యతిరేకం కాదంటూనే..మావిగన్ ప్రతిపాదనలో తప్పేం లేదంటూ కవర్ డ్రైవ్ స్టార్ట్ చేశారు బొత్స, అధినేత నుంచి.. పార్టీలో సీనియర్ లీడర్ వరకు ఒక్కొక్కరిది ఒక మాట. ఎవరి మాటల్లో క్లారిటీ లేదు. అంతా కన్‌ఫ్యూజన్. గజిబిజి గందరగోళం. అమరావతికి వ్యతి రేకం కాదంటారు. జగన్ సూచిం చిన మావిగన్ ప్రతిపాదనలో తప్పేం లేదంటారు. జగనేమో ప్లాన్-ఎ త్రీ క్యాపిటల్స్..ప్లాన్-బి మావిగన్ అంటారు. అమరావతి పేరుతో ఒకేచోట అభివృద్ధి చేస్తే ఎలా అని ప్రశ్నిస్తారు. ఉత్తరాంధ్ర పరిస్థితి ఏంటంటూ నిలదీస్తారు. దీంతో ఒక ప్రధాన రాజకీయ పార్టీగా వైసీపీ..ఏపీ రాజధాని విషయంలో స్పష్టంగా ఉండలేకపోతోందా అన్న చర్చ సాగుతోందివైసీపీలో ఉన్న అన్ని ప్రాంతాల నాయకులు రాజధానిపై ఒకే మాట మీద ఉంటున్నారా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధినాయకుడు జగన్ ఈ నెల 1న ప్రెస్ మీట్ పెట్టి మరీ మావిగాన్ అని ఒక కొత్త ప్రతిపాదన చేశారు. దాని మీద వైసీపీలోనే డిఫరెంట్ ఒపీనియన్స్ ఉన్నాయా అన్న డౌట్స్ వ్యక్తం అవుతున్నాయి. ఉత్తరాంధ్రకు చెందిన సీనియర్ నేతలు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి.

మిగతా 2లో

## పాదయాత్రల సాక్షిగా వర్డ్ వార్

**కడప-సూర్య వాస్తవం:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేసి, సంక్షేమ రాజ్యానికి బాటలు వేసిన దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి చేపట్టిన చారిత్రాత్మక 'ప్రజాప్రస్థానం' పాదయాత్రకు నేటితో 23 ఏళ్లు పూర్తయ్యాయి. అయితే, ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన వారసులు, అన్నాచెల్లెళ్లు అయిన వైఎస్ జగన్, వైఎస్ షర్మిల మధ్య సోషల్ మీడియా వేదికగా సాగిన మాటల యుద్ధం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తండ్రి ఆశయాల వారసులం మేమంటే మేమని ఇద్దరూ క్లెయిమ్ చేసుకుంటున్నప్పటికీ, ఒకరిపై ఒకరు చేసుకున్న విమర్శలు శృతిమించాయి. మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ తన తండ్రి పాదయాత్రను గుర్తు చేసుకుంటూ భావోద్వేగ పూరితమైన ట్వీట్ చేశారు. ఏప్రిల్ 9, 2003న ఎర్రటి ఎండలో ప్రజల కష్టాలు తెలుసుకోవడా నికి వైఎస్సార్ వేసిన అడుగులు, రాష్ట్ర చరిత్రను తిరగరాశాయని ఆయన కొనియాడారు. "నేనున్నాను" అనే భరోసాతో ప్రజల గుండెల్లో వైఎస్సార్ నిలిచిపోయారని, ఆ పాదయాత్రే ఆయన్ను ముఖ్యమంత్రిని చేసిందని పేర్కొన్నారు. ముఖ్యం గా వైఎస్సార్ హయాంలో జరిగిన ఉచిత విద్యుత్ సంతకం, జలయజ్ఞం, పోలవరం ప్రాజెక్టు వేగం, విద్య, వైద్య రంగాల్లో వచ్చిన విప్లవాత్మక మార్పులను జగన్ గుర్తు చేశారు. తన తండ్రి వేసిన ఆ ముద్రను ఎవరూ చెరిపే యలేరని, అదే స్ఫూర్తితో తన ప్రయాణం కొనసాగుతుందని జగన్ స్పష్టం చేశారు. తండ్రి వారసత్వాన్ని తన సంక్షేమ పాలనతో ముందుకు తీసుకెళ్తున్నానని ఆయన పరోక్షంగా ఈ ట్వీట్ ద్వారా సందేశాన్ని ఇచ్చారు.జగన్ ట్వీట్‌కు ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అత్యంత ఘాటుగా స్పందించారు. వైఎస్సార్ పాదయాత్ర ను ఒక కాంగ్రెస్ సైనికుడిగా, పీసీసీ అధ్యక్షుడిగా ప్రారంభిం చారన్న విషయాన్ని ఆమె ప్రధానంగా గుర్తు చేశారు. వైఎస్సార్ పేరును పార్టీలో పెట్టు కుని, ఆయన ఆశ యాలకు విరుద్ధంగా జగన్ వ్యవహరిస్తున్నా రని నేరుగా విమర్శించారు. లౌకిక వాదానికి నిలువుటద్దంలా నిలిచిన వైఎస్సార్ ఎక్కడ? మతోన్మాద బీజేపీకి ఢిల్లీలో తలవంచి, రాష్ట్రంలో మౌనం వహిస్తున్న జగన్ ఎక్కడ? అని ఆమె ప్రశ్నించారు. వక్ఫ్ చట్టం, దళిత క్రైస్తవుల రిజర్వేషన్లు వంటి అంశాల్లో జగన్ వైఖరిని ఆమె తప్పుబట్టారు. జగన్ ఐదేళ్ల పాలనలో దళితులు, మహిళలు, మైనారిటీలపై దాడులు పెరిగాయని, ఇది వైఎస్సార్ ఆత్మ క్షోభించేలా ఉందని ఆరోపించారు.



### పీఎన్జీ వినియోగంపై

# అవగాహన పెంచాలి

- పీఎన్జీ కనెక్షన్లు పెరగాలి.. ఆయిల్ కంపెనీలు లక్ష్యం చేరుకోవాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశం.. రాష్ట్రంలో గ్యాస్ సరఫరాపై సమీక్ష
- శ్రీకాకుళం-కాకినాడ నేచురల్ గ్యాస్ పైపు లైన్ పనుల పూర్తికి కేంద్రం మంత్రికి సీఎం ఫోన్



**అమరావతి-సూర్య వాస్తవం:** యుద్ధాల కారణంగా తలత్తిన ఎల్పీజీ గ్యాస్ సరఫరా సమస్యను ఎదుర్కొనేందుకు మరింత సన్నద్ధతతో పనిచేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు, ఆయిల్ కంపెనీలకు సూచించారు. పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ) వినియోగం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. దీపం పథకం లబ్దిదారులకు పీఎన్జీ వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. దీపం పథకం లబ్దిదారులు పీఎన్జీకి మారితే.. వారికి దీపం పథకం కింద ఇచ్చే రాయితీ సొమ్మును జమ చేసేందుకు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నామని.. దీనిపై వెంటనే ఉత్తర్వులు విడుదల చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. పీఎన్జీ కనెక్షన్ తీసుకున్నా దీపం పథకం ద్వారా కలిగే లబ్ది పొంద వచ్చన్న విషయంపై లబ్దిదారులకు అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో గ్యాస్ సరఫరాపై సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. గ్యాస్ సరఫరా ఇబ్బందులను అధిగమించడానికి ఆయిల్ కంపెనీలు పీఎన్జీ కనెక్షన్లను పెంచేందుకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. వచ్చే 6 నెలల్లో మొత్తం 10 లక్షల పీఎన్జీ కనెక్షన్లు ఇవ్వాలని... ఈ విషయంలో జాప్యం ఉండకూడదని, టార్గెట్ ఎట్టిపరిస్థితుల్లో చేరుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గృహ అవసరాలకు సంబంధించి గ్యాస్ సరఫరాలో సమస్యలను అధిగమించామని తెలిపారు. డొమస్టిక్ పంపిణీకి సంబంధించి సమస్యను తగ్గించామని... త్వరలో సాధారణ స్థితికి తీసుకువస్తామన్నారు. శ్రీకాకుళం - కాకినాడ నేచురల్ గ్యాస్ పైప్ లైన్ పనుల్లో జాప్యంపై సీఎం అధికారుల వివరణ కోరారు. దీనికి సంబంధించి కేంద్రం కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందని అధికారులు చెప్పడంతో... సమీక్ష నుంచే కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరికి ముఖ్యమంత్రి ఫోన్ చేశారు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి అయినందున వెంటనే పనులు పూర్తి చేసేలా చూడాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి త్వరలోనే సమీక్షించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మిగతా 2లో

## 2029 వైసీపీ స్లోగన్స్ రెడీ

**విజయవాడ-సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్‌లో రాజధాని అమరావతి అంశం పొలిటికల్ హీట్ పెంచింది. అమరావతికి కేంద్రం చట్టబద్ధత కల్పించిన తర్వాత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సరికొత్త ప్రతిపాదనల్ని తెరపైకి తెచ్చారు. మావిగన్ పేరుతో మచిలీపట్నం, విజయ వాడ, గుంటూరును కలిపి కారిడార్‌గా ప్రకటిస్తే బా వుటుందన్నారు. అమరావతికి కంటే తక్కువ ఖర్చు తో రాజధానిగా అభివృద్ధి చేయొచ్చన్నారు. అయితే వైఎస్సార్‌సీపీ మావిగన్ పేరుతో కొత్త స్లోగన్‌ను అందుకుంది. రావాలి జగన్, కావాలి మావిగన్ అంటూ ఫ్లెక్సీలు వెలిశాయి. 2019 ఎన్నికలు అందరికి గుర్తున్నాయా.. వైఎస్సార్‌సీపీ 151 సీట్లలో ఘన విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. అయితే 2019 ఎన్నికల సమయంలో ఒక స్లోగన్ రాష్ట్ర మొత్తం మార్మోగింది.. అదే 'రావాలి జగన్, కావాలి జగన్'. వైఎస్సార్‌సీపీ ఈ నినాదాన్ని ప్రజల్లోకి బాగా తీసుకెళ్లింది. అంతేకా దు 'రావాలి జగన్, కావాలి జగన్' అంటూ ఓ పాటను కూడా విడుదల చేయగా.. ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. 2019 ఎన్నికలకు ఈ స్లోగన్ బాగా కలిసొచ్చింది.. జనాలను ఆకట్టుకుంది. ఇప్పుడు కూడా అదే తరహాలో మరో కొత్త స్లోగన్ తెరపైకి వచ్చింది..

2లో

రాష్ట్రంలో ఫ్లెక్సీలు కూడా ఏర్పాటవుతున్నాయి. వైఎస్సార్‌సీపీ.. రావాలి జ'గన్'..కావాలి మావి 'గన్' అంటూ కొత్త స్లోగన్‌ను మొదలు పెట్టింది. ఆ పార్టీ నేత కారుమూరు వెంకటరెడ్డి పేరుతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయగా.. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'మన మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు.. ఆంధ్రప్రదేశ్ బాగుండాలి అంటే.. త్వరగా అభివృద్ధి చెందాలి అంటే.. మావిగన్ రాజధాని కారిడార్ అవ్వాలి.. అది జగనన్నతోనే సాధ్యం. మన రాజధాని మావిగిన్.. మావిగన్ ఆంధ్రప్రదేశ్‌కు గ్రోత్ ఇంజన్' అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.



# సంపాదకీయం

## పొంచి ఉన్న కరువు పరిస్థితులు...



గత ఏడాది రికార్డు స్థాయిలో వర్షాలు కురిసాయి. పంటలు సమృద్ధిగా పండాయి. కానీ ఈ ఏడాది అలా పరిస్థితి ఉండదని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ప్రధానంగా పసిఫిక్ మహాసముద్రంలో వేగంగా మారుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా.. 2026 లో అత్యంత బలమైన ఎల్ నినో పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని అంతర్జాతీయ వాతావరణ సంస్థలు అంచనా వేస్తున్నాయి.

ఈ ఏడాది వర్షాలు కురిసే అవకాశం కనిపించడం లేదని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ వర్షాకాలం దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది రైతులకు అత్యంత కష్టతరంగా మారబోతోందన్న హెచ్చరికలు వస్తున్నాయి. అయితే ముందుగానే ఈ హెచ్చరికలు వచ్చాయి. కానీ ఎల్ నినో ప్రభావం ఈ స్థాయిలో ఉండబోతుంది అని తెలుస్తుండడం మాత్రం ఆందోళన కలిగిస్తోంది.కొన్ని ప్రాథమిక విశ్లేషణల ప్రకారం ఈ ఏడాది ఇబ్బందికర పరిస్థితులు తప్పవని అర్థమవుతోంది. ఈ శతాబ్దంలోనే అత్యంత తీవ్రమైన ఉష్ణ మండల వాతావరణం నమోదయ్యే ప్రమాదం ఉంది. రుతుపవనాల గమనాన్ని అస్తవ్యస్తం చేసి.. వర్షాలు పడకుండా చేస్తోందని తెలుస్తోంది.

వ్యవసాయ రంగం దారుణంగా దెబ్బతినే అవకాశం ఉంది. ఎల్ నినో ప్రభావం ఉన్న ప్రతిసారి మన దేశంలో వర్షపాతం గణనీయంగా తగ్గుముఖం పట్టింది. అటువంటిది ఈ ఏడాది సూపర్ ఎల్ నినో ఉంటుందని తెలియడం మాత్రం ఆందోళన కలిగిస్తోంది. సుదీర్ఘమైన కరువు కాటకాలకు దారి తీయవచ్చు అని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా భారతదేశంలో రైతులకు ప్రయోజనం చేకూర్చే నైరుతి రుతుపవనాలను ఎల్ నినో నాశనం చేస్తుందని చెబుతున్నారు. వర్షాలు సరిగ్గా పడక తీవ్ర దుర్భిక్షం ఏర్పడుతుందని.. సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గి.. భూగర్భ జలాలు అడుగంటి పోయే ప్రమాదం ఉందని.. రైతాంగం తీవ్ర పెట్టుబడి నష్టాలను చవిచూడాల్సి ఉంటుందని హెచ్చరికలు వస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.మెరికా, ఇరాన్ దేశాల మధ్య నిన్నటిదాకా భీకరమైన యుద్ధం జరిగింది. కాల్పుల విరమణ ఒప్పందం ద్వారా ఆ యుద్ధం తాత్కాలికంగా వాయిదా పడింది. యుద్ధం వల్ల జరిగే దాడులు విపరీతమైన కాలుష్యానికి కారణమవుతుంటాయి. కాలుష్యం వల్ల వాతావరణంలో అనేక రకాలుగా మార్పులు చోటుచేసుకుంటాయి. వాటి వల్ల కరువు కాటకాలు ఏర్పడుతుంటాయి. రెండవ ప్రపంచ యుద్ధాన్ని తీసుకుంటే.. నాడు అమెరికా వేసిన న్యూక్లియర్ బాంబు వల్ల జపాన్ తీవ్రంగా నష్టపోయింది. ఆ బాంబు వేసిన ప్రాంతంలో ఇప్పటికీ పచ్చ గడ్డి కూడా మొలవడం లేదు. దీనిని బట్టి యుద్ధం లాంటి వైపరీత్యాలు చోటు చేసుకున్నప్పుడు ప్రకృతి ఎంత ప్రభావితమవుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇక యుద్ధం తాత్కాలికంగా ముగిసింది అనుకుంటే.. మరో ఉపద్రవం ప్రపంచాన్ని ఇబ్బంది పెడుతోంది. ఈసారి ప్రపంచాన్ని ఆ విధంగా కలవరపెడుతున్న అంశం యుద్ధం కాదు.. మరొకటి కాదు.. అది కరువు.ఈ కరువు ఏర్పడేందుకు ప్రధాన కారణం పసిఫిక్ మహాసముద్రం. కొంతకాలంగా పసిఫిక్ మహాసముద్రం వేడెక్కుతోంది. దీనివల్ల ఎల్ నినో ఏర్పడుతోంది. ఎల్ నినో అనేది పసిఫిక్ సముద్రంలో సాధారణంగా ఏర్పడేదే. అయితే ఈసారి ఏర్పడుతున్న ఎల్ నినో అత్యంత ప్రమాదకరమైనది. దీనివల్ల 2027 వరకు ప్రపంచ వ్యాప్తంగా ఎండలు మండిపోతాయట. చివరికి ధ్రువ ప్రాంతాలలో కూడా ఉష్ణోగ్రతలు పెరుగుతాయట. ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న దేశమైన భారత్ లో ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు కురిసే అవకాశం లేదట. దీనివల్ల సాగురంగం పూర్తిగా దెబ్బతింటుందట. మనదేశంలో కరువు పరిస్థితి ఉంటే.. దక్షిణ అమెరికాలో భారీగా వరదలు వస్తాయట. విస్తారమైన వర్షాలు కురిసి ప్రాంతాలకు ప్రాంతాలు మీట మునిగిపోతాయట. సముద్ర తీర ప్రాంతం మరింత ముందుకు దూసుకు వస్తుందట.. తీర ప్రాంతాలు కోతకు గురి అవుతాయట.

మనదేశంలో కరువు అనుకుంటే.. ఆసియా మొత్తం కూడా కరువు వచ్చే అవకాశం ఉంటుందట. వాతావరణ మొత్తం అల్లకల్లోలంగా ఉంటుందట. అందువల్లే ఇప్పటినుంచే ఆయా ప్రభుత్వాలు సిద్ధంగా ఉండాలని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే కరువు వల్ల చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఆహార ధాన్యాలకు.. ఇతర తిండి గింజలకు తీవ్రమైన కొరత ఏర్పడుతుంది. ఆ సమయంలో మరణాలు కూడా చోటుచేసుకుంటాయి. ఇవన్నీ జరగకూడదు అనుకుంటే ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఎల్ నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలో సర్వసాధారణంగా ఏర్పడేదే. అయితే ఈసారి అత్యంత తీవ్రమైన ఎల్ నినో ఏర్పడడం వల్ల కరువు కాటకాలు అధికంగా వస్తాయట.ఒక్క వర్షాభావ పరిస్థితులే కాదు.. దేశవ్యాప్తంగా భారీగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని కూడా హెచ్చరికలు వస్తున్నాయి. అసాధారణ రీతిలో పెరుగుతాయని సంకేతాలు వస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. వ్యవసాయరంగం పూర్తిగా దెబ్బతింటే ఆ ప్రభావం దేశం పై పడుతుంది. అందుకే ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఒకసారి మన దేశ చరిత్రను గమనిస్తే.. ఎక్కువ శాతం కరువులు ఎల్ నినో సమయంలో సంభవించినవే.

2009లో అత్యంత తీవ్రమైన ఎల్ నినో కారణంగా దేశంలో అంతకుముందు 30 ఏళ్లలో లేనంతగా.. 22 శాతం వర్షపాతం తగ్గింది. దీనికి కారణంగా దేశవ్యాప్త కరువుకు దారితీసింది. 2014 నుంచి 2016 మధ్య ఎల్ నినో ప్రభావంతో వరుసగా రెండు సంవత్సరాలు వర్షాలు తగ్గి వ్యవసాయరంగం తీవ్రంగా నష్టపోయింది. 2023 లో కూడా ఎల్ నినో ప్రభావంతో ఆగస్టు నెలలో వందేళ్లలో ఎన్నడూ లేనంత తక్కువ వర్షపాతం నమోదయింది.. అయితే ఈ ఏడాది సూపర్ ఎల్ నినో ఉంటుందని తెలియడంతో తీవ్ర దుర్భిక్షం తప్పదన్న హెచ్చరికలు వస్తున్నాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# అణగారిన వర్గాలకు విద్యను చేరువ చేసిన మహాత్మా జ్యోతిబా పూలే


డా. ముచ్చుకోట.సురేష్ బాబు




భారతదేశంలోని ప్రముఖ సామాజిక సంస్కర్తలలో ఒకరైన మహాత్మా జ్యోతిబా పూలే జననం జరిగిన రెండు వందల సంవత్సరాల తర్వాత కూడా, ఆయన ప్రతిపాదించిన సార్వత్రిక విద్య భావన ఇప్పటికీ ప్రతిధ్వనిస్తూ, దేశంలోని ప్రస్తుత ప్రజా విద్యా వ్యవస్థపై కీలక ప్రశ్నలను లేవనెత్తుతోంది. సమానత్వం, విద్యకు కట్టుబడి ఉన్న పూలే, విద్య సమాజంలోని ప్రతి వర్గానికి చేరాలి అని నమ్మారు. "విద్య సార్వత్రికంగా ఉండాలి; సంఖ్యలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ చేరాలి" అని ఆయన స్పష్టం చేశారు. అదే సమయంలో, పేదల నుండి పన్నులు వసూలు చేస్తూ వారికి విద్యను అందించడంలో విఫలమైన బ్రిటిష్ వలస పాలనను ఆయన తీవ్రంగా విమర్శించారు.

సామాజిక అడ్డంకులపై పోరాటం19వ శతాబ్దం మధ్యకాలంలో, మహిళలు మరియు దళితులు వంటి అణగారిన వర్గాల కోసం పాఠశాలలను ప్రారంభించడం ద్వారా పూలే ధైర్యవంతమైన అడుగు వేశారు. ఈ చర్యకు సంప్రదాయవాద వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. ఈ వ్యతిరేకత అంతగా పెరిగి ఆయన కుటుంబంపైనా ఒత్తిడి పెరిగింది. ఆయన తండ్రి గోవిందరావు, పాఠశాలను మూసివేయాలని లేదా ఇంటిని విడిచి వెళ్లాలని షరతు పెట్టినట్లు తెలుస్తోంది. అయితే తన నిబద్ధతను వదలని పూలే, ఇంటిని విడిచిపోవడానికే సిద్ధపడ్డారు. "నేను ఇల్లు వదిలి వెళ్లవచ్చు, కానీ పాఠశాలను మూసివేయను" అని ప్రకటించి, తన భార్య సావిత్రిబాయి పూలే తో కలిసి బయటకు వెళ్లారు. ఆమె కూడా విద్యారంగంలో ముందడుగు వేసిన ప్రముఖ సంస్కర్తగా నిలిచారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా మొదటి పాఠశాల తాత్కాలికంగా మూసివేయాల్సి వచ్చినప్పటికీ, విద్య విస్తరణపై వారి సంకల్పం ఏమాత్రం తగ్గలేదు.

సంస్కరణలకు సంస్థాగత రూపంపూలే స్థాపించిన సత్యశోధక సమాజ్ కుల వ్యవస్థను కూలదోసి సామాజిక న్యాయం సాధించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సంస్థ కార్యకలాపాలలో విద్యకు కేంద్ర స్థానం కల్పించబడింది. పాఠశాలలు స్థాపించడం, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించడం, ఉచిత మరియు తప్పనిసరి ప్రాథమిక విద్య కోసం బలంగా వాదించడం వంటి కార్యక్రమాలు చేపట్టింది. 'దీన్ బంధు' పత్రికలో చేసిన రచనల్లోనూ, హంటర్ కమిషన్ ముందు ఇచ్చిన వాంగ్మూలంలోనూ, పూలే తన కాలంలో ఉన్న విద్యా అసమానతలను స్పష్టంగా వెలుగులోకి తెచ్చారు. గ్రామాల ఎక్కువ భాగంలో పాఠశాలలు లేవని, సామాన్య ప్రజలకు ప్రాథమిక విద్య కంటే ఎలైట్ వర్గాలకు ఉన్నత విద్యను ప్రాధాన్యం ఇస్తున్నారని ఆయన వలస పాలనను విమర్శించారు.

### ప్రస్తుత పరిస్థితులపై ఆందోళనలు

నేటి భారతదేశంలో కూడా పూలే ఆలోచనలు విద్యా విధానాలపై జరుగుతున్న చర్చల్లో మళ్లీ ప్రాముఖ్యత పొందుతున్నాయి. జాతీయ విద్యా విధానం కింద అమలు చేస్తున్న పాఠశాల విలీనాలు, రేషనలైజేషన్, "స్కూల్ కాంప్లెక్స్" విధానం వంటి చర్యలు గ్రామీణ ప్రాంతాల్లో వేలాది ప్రభుత్వ పాఠశాలల మూసివేత దారితీస్తున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. తక్కువ విద్యార్థుల నమోదు లేదా పరిపాలన సామర్థ్యం పేరుతో చేపడుతున్న ఈ మూసివేతలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు ఎక్కువ ప్రభావం చూపుతున్నాయి. సమీప పాఠశాలలను దూర ప్రాంతాల పాఠశాలల విలీనం చేయడం వల్ల చిన్నారులు ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తుంది. ఇది విద్య అందుబాటుపై, అలాగే చదువు మానివేత (డ్రాప్‌ఔట్) రేటుపై ఆందోళనలు కలిగిస్తోంది. విద్యా పరిరక్షణ కార్యకర్తలు హెచ్చరిస్తున్నదేమిటంటే, ఈ విధమైన కేంద్రీకరణ ప్రజా విద్యా వ్యవస్థను బలహీనపరచే ప్రమాదం ఉందని. స్థానిక పాఠశాలలను బలోపేతం చేయడం బదులుగా కేంద్రీకృత నమూనాల వైపు మళ్లడం, విద్య ఒక ప్రజా హక్కుగా భావించే మౌలిక సిద్ధాంతాన్ని దెబ్బతీయవచ్చని వారు అంటున్నారు.

### కొనసాగుతున్న ప్రశ్న

పూలే మరణించి శతాబ్దానికి పైగా గడిచినా, ఆయన లేవనెత్తిన ప్రశ్న ఇప్పటికీ ప్రాసంగికంగానే ఉంది: ప్రజల పన్నులతో నడిచే ప్రభుత్వాలు అందరికీ, ముఖ్యంగా అణగారిన వర్గాలకు, విద్యను ప్రాధాన్యంగా ఇవ్వకూడదా? భారతదేశం విద్యలో సామర్థ్యం సమానత్వం మధ్య సమతౌల్యం సాధించడానికి ప్రయత్నిస్తున్న ఈ సమయంలో, ప్రతి పల్లెలో పాఠశాల అందుబాటును కాపాడటం పూలే వారసత్వానికి సరైన నివాళిగా భావించవచ్చు. సమాజ మార్పుకు విద్యే పునాది అన్న ఆయన నమ్మకం నేటికీ మార్గదర్శకంగా నిలుస్తోంది.

# నిర్విరామ పోరాటాల ఫలితమే కృష్ణా జలాలు..

- చంద్రబాబు మాటలన్నీ అబద్ధాలే : మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి
- రాయలసీమ ఎత్తిపోతల పథకంపై చర్చలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



**ఉరవకొండ – సూర్య వాస్తవం:**

అనంతపురం కల్యాణ మండపం లో జరిగిన రాయలసీమ ఎత్తిపోతల పథకం పై జరిగిన చర్చా కార్యక్రమంలో ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వైసీపీ ఇన్చార్జ్ వై విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ అన్ని జిల్లాల నాయకులను సమన్వయం చేసుకుంటూ ముందుకు తీసుకెళుతున్న మాజీ ఎంపీ సాకే శైలజనాథ్ కి వేదిక మీద ఉన్న రాష్ట్ర నాయకులకు జిల్లా నాయకులకు ఇక్కడికి విచ్చేసినటువంటి అనుబంధ సంఘాల నాయకులకు అలాగే సత్యసాయి జిల్లా నుంచి మన వెంకట్రామిరెడ్డి ఇతర నాయకులకు అందరికీ పేరు ేఎరునా వందనాలు తెలియజేస్తున్నాను చాలా రోజుల తర్వాత స్వాతంత్రం అనంతరం కూడా మనం రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టు గురించి మాట్లాడుకునే పరిస్థితి రావడం చాలా బాధాకరమైనటువంటి విషయం ముఖ్యంగా మనం ఎన్నో పోరాటాల ద్వారా ఈ ప్రాజెక్టుల్ని సాధించుకున్నాము మొన్న యాడికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లాకు 74 టీఎంసీలు నీళ్లు తీసుకుని వచ్చామని భూగర్భ జలాలు 2.2 మీటర్ల పైకి వచ్చాయని అన్నారు అలాగే శ్రీకాకుళంలో వర్షం కురిస్తే అనంతపురానికి నీళ్లు తెస్తానని అబద్ధపు మాటలు చెబుతున్నాడు కానీ వాస్తవానికి ఇవన్నీ కూడా ఎవరో ఒకరు తెచ్చినటువంటివి కావు తరతరాలుగా రాయలసీమ ప్రజలు ప్రత్యేకించి అనంతపురం జిల్లా ప్రజలు నిర్విరామ పోరాటాల ఫలితంగానే కృష్ణా జలాలు అనంతపురానికి రావడం ఈ ప్రాజెక్టులన్ని నిర్మాణం కావడం జరిగాయి ప్రత్యేకించి అందరం కూడా వైయస్ రాజశేఖర్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేయాలి. ఎందుకంటే ప్రజా పోరాటానికి అందించినటువంటి ఒక మానవతా దృక్పథంతో ప్రాజెక్టులు ప్రారంభించిన టువంటి వ్యక్తి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆరోజు వైఎస్ రాజశేఖర్ రెడ్డి



లేకపోతే అందరిని వాని హేళన చేసేవారు లిఫ్ట్ ఇరిగేషన్ అసాధ్య మైంది అనేవారు కాని దాన్ని సాధ్యం చేసి చూపించిన వారు రాజశేఖర్ రెడ్డి ఈరోజు ఎండాకాలం వస్తే మన మందరం కూడా బిందెలు కుండలు పట్టుకుని నీటి కోసం రోడ్లపై ధర్నాలు చేసే వాళ్ళం ఈరోజు అవి కనిపించడం లేదంటే కృష్ణ జలాలను రాయలసీమకు తీసుకురావడమే కారణం ఇప్పటికే ఎడారి బతుకులు అయ్యుండేటివి కానీ వీటన్నిటిని ఎదుర్కోవాలంటే ప్రజలు గళం ఇప్పాల్సినటువంటి సమయం ఆసన్నమైంది లేకపోతే పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కును కోల్పోయే పరిస్థితి కళ్ళముందే కనిపిస్తా ఉంది ఎంతో ముందు చూపుతో రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టును మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారు కానీ తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ నేనే చంద్రబాబు నాయుడుతో చెప్పి రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఆపించానని చెప్పడం మన రాష్ట్ర ప్రజల ఆత్మ గౌరవాన్ని కించపరచడం అవుతుంది ఇంతకీ చంద్రబాబు నాయుడు ఎవరు ఏకపక్షంగా మాట ఇవ్వడానికి ఈ విషయం తెలుసుకున్న ప్రజలు నిర్ఘాంతపోయారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలకు సమానంగా ఇక్కడి ముఖ్యమంత్రి గాని ఇతర మంత్రులు గాని రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టును కొనసాగిస్తాం అని గాని రేవంత్ రెడ్డి చెప్పిన మాటలు అబద్ధమని గాని ఎవరు చెప్పడం లేదు ముఖ్యమంత్రి మొదలుకొని అనంతపురం జిల్లా మంత్రి పయ్యావుల కేశవ్, వైసీపీపై దాడి చేస్తున్నారు పయ్యావుల కేశవ్ ఏం మాట్లాడుతాడు అంటే అదో దొంగ ప్రాజెక్టు అని ఆర్థిక శాఖకు సంబంధం లేకుండా 1000 కోట్ల రూపాయలు తెచ్చుకొని వాడుకున్నారు అని జగన్మోహన్ రెడ్డి మీద నిందలు వేస్తున్నాడు ఇక్కడ టిడిపి నాయకులు ఏమో ఆ ప్రాజెక్టు అవసరం లేదు అంటున్నారు. అమరావతి కోసం తీర్మానం చేయించిన మీరు ఈ ప్రాజెక్టుకు అనుమతులు తేలేరా అని అడుగుతున్నా మీకు అమరావతి తప్ప రాయలసీమ అవసరం లేదా రాయలసీమలోని ప్రాజెక్టుల గురించి ఒక్క నిమిషమైనా ఈ ప్రభుత్వం ఆలోచిస్తుందా ప్రభుత్వం వచ్చి ఒకటిన్నర సంవత్సర కాలం పూర్తి అయింది అమరావతి తప్ప ఈ రాష్ట్ర సమస్యలు చర్చించడం లేదు రాబోయే కాలంలో వైఎస్ఆర్సిపి పార్టీ తీసుకునే నిర్ణయానికి మనమందరం సంసిద్ధమై రాయలసీమ ప్రాజెక్టుల కోసం బ్రహ్మాండమైన ఉద్యమాన్ని తీసుకురావాలని మీ అందరికీ విజ్ఞప్తి చేస్తున్నా నాకు ఈ అవకాశం ఇచ్చిన అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నారని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వైఎస ఆర్సిపి ఇన్చార్జ్ వై విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు ఈ కార్యక్రమం లో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల మాజీ ఎమ్మెల్యేలు జడ్పీటీసీలు ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### శ్రీవారిని దర్శించుకున్న
## ఏపీఎల్సీ ఎథిక్స్ కమిటీ చైర్మన్ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి





**పులివెందుల - సూర్య వాస్తవం**
ఆంధ్రప్రదేశ్ శాసనమండలి నైతిక విలువల కమిటీ ఏపీఎల్సీ ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి శుక్రవారం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. కమిటీ చైర్మన్ హోదాలో తిరుమలకు చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం తన సహచర కమిటీ సభ్యులతో కలిసి ఆయన స్వామి వారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం మీడియా ప్రతినిధులతోభూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి మాట్లాడుతూరాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనించాలని శ్రీవారిని ప్రార్థించినట్లు తెలిపారు. శాసనమండలి ఎథిక్స్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత కమిటీ సభ్యులతో కలిసి స్వామివారి ఆశీస్సులు తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ దర్శన కార్యక్రమంలో కమిటీ సభ్యులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో పండితులు వీరికి వేదాశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

## ప్రజల కోసం ప్రజాదర్బార్ ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్



**ఉరవకొండ - సూర్య వాస్తవం:** స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ ఆధ్వర్యంలో 'ప్రజాదర్బార్' నిర్వహించడమైనది. నియోజకవర్గ ప్రజల నాయకుల సమస్యలను నేరుగా తెలుసుకోవడం జరిగింది. నియోజకవర్గంలోని నలుమూలల నుండి వచ్చిన ప్రజలతో మంత్రి స్వయంగా మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై వినతి పత్రాలను (అర్జీలను) ఆయన స్వీకరించారు. అందిన ఫిర్యాదులను పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని ప్రజలకు మంత్రి హామీ ఇచ్చారు. ప్రజాప్రతినిధులు ఇలా నేరుగా ప్రజల వద్దకు వచ్చి సమస్యలు వినడం వల్ల పాలనలో పారదర్శకత పెరగడమే కాకుండా, క్షేత్రస్థాయి సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభించే అవకాశం ఉంటుంది. అందిన అర్జీలలో ప్రధానంగా మౌలిక సదుపాయాలు, పెన్షన్లు, మరియు ఇతర వ్యక్తిగత సమస్యలు ఉన్నట్లు తెలుస్తోంది.

## టమోటా ధరల్లేక రైతులు విలవిల



**తొండూరు - సూర్య వాస్తవం:** టమోటా ధరల్లేక రైతులు విలవిలలాడుతున్నారు. ఇక్కడి వాతావరణం అనుకూలం కావడంతో సంవత్సరం పొడవునా తొండూరు మండలం లోని రైతులు టమోటా సాగుచేస్తారు. కొన్ని నెలలుగా 15 కిలోల బాక్సు ధర రూ.100 నుంచి రూ.150 వరకు పలుకుతోంది. వ్యాపారులు ఇక్కడ టమోటాను కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. అక్కడ రాష్ట్రాల్లో టమోటా దిగుబడి ఎక్కువగా ఉండడంతో వ్యాపారులు టమోటా కొనుగోలుకు మొగ్గు చూపడంలేదు. దీంతో రైతులు టమోటాను మార్కెట్ తీసుకొస్తే కొందరు వ్యాపారులు స్థానికంగా అమ్మడానికి మేలు రకం టమోటాను కొనుగోలు చేసి మిగతా వాటి కొనుగోలుకు మొగ్గుచూపడంలేదు. దీంతో రైతులు టమోటాను మార్కెట్‌లోనే ఉంచి తమ గ్రామాలకు చేరుకొంటున్నారు. టమోటా ధరలతో కోత కూలీ కూడా రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరి కొందరు టమోటాను తోటల్లో కోయకుండా వదిలివేస్తున్నారు. మరికొందరైతే టమోటా పంటను ట్రాక్టర్ ద్వారా దున్ని ఇతర పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు.

## భక్తితో కొనసాగుతున్న భగవద్గీత పారాయణం



**వేంపల్లె - సూర్య వాస్తవం:**
వేంపల్లె మండలం కుమ్మరాం పల్లెలోని శ్రీకృష్ణ ఆలయంలో భక్తితో భగవద్గీత సప్తహ పారాయణం ప్రారంభించారు. ఈ సందర్భంగా భగవద్గీత పండితులు భగవద్గీత శ్లోకాలు, భగవద్గీత సారాంశం, శ్రీకృష్ణ పరమాత్మ సందేశాలను వివరించారు. ప్రతిరోజు భగవద్గీత చదవడం వలన ఆధ్యాత్మిక భావం అలవాటు పడుతున్నారు. ఈ కార్యక్రమంలో భగవద్గీత సప్తహ మండలి సభ్యులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బీజేపీ ఒక శనిగ్రహం

## వైకాపా, టిడిపిలు రాహు కేతువులు
## వైకాపా, టీడీపీలది సవతుల పోరు
## రాష్ట్ర సమగ్రాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం



## డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి

**వేంపల్లె - సూర్య వాస్తవం**
రాష్ట్రానికి బిజెపి ఒక శని గ్రహములా పట్టుకున్నదని, ప్రాంతీయ పార్టీలైన వైకాపా, టీడీపీలు రాహు కేతువులుగా దాపురించాయని, రాష్ట్ర సమగ్రాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో వైకాపా, టిడిపిలది సవతుల పోరుగా తయారైందని, ఈ రెండు పార్టీలు రాష్ట్ర అభివృద్ధి గురించి ఏమాత్రం పట్టించుకోవడంలేదని, సవతులు కొట్లాడుకున్నట్టు నిరంతరము పొట్లాటలతోనే సరిపోయిందని తులసి రెడ్డి అన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం నవ్యాంధ్రప్రదేశ్ కు మూడు వరాలు ప్రకటించింది. ఒకటి ప్రత్యేక హోదా. రెండవది ప్రత్యేక ప్యాకేజ్. మూడవది వివిధ సెక్షన్ల కింద, షెడ్యూల్ల కింద దాదాపు 5 లక్షల కోట్ల రూపాయలు విలువ చేసే ప్రయోజనాలు కేంద్రం రాష్ట్రానికి అందించడం. ప్రత్యేక హోదా రాష్ట్రానికి సంజీవని లాంటిది. ఇది ఆంధ్రప్రదేశ్ కు హక్కు. కానీ అమలు కాలేదు. విభజన చట్టంలో సెక్షన్ 46 సబ్ సెక్షన్ 3 ప్రకారము కేంద్ర ప్రభుత్వం రాయలసీమకు, ఉత్తరాంధ్రకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ కింద నిధులు ఇవ్వాలి. కానీ ఇవ్వలేదు. విభజన చట్టంలో 13వ షెడ్యూల్ ప్రకారము కేంద్ర ప్రభుత్వము స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో కడప జిల్లాలో సమీకృత ఉక్కు కర్మాగారం నిర్మించాలి. మేజర్ ఓడరేవు నిర్మించాలి. సెక్షన్ 94 సబ్ సెక్షన్ 3 ప్రకారము రాజధాని ప్రాంతంలో రాజ్ భవన్, రాష్ట్ర సచివాలయం, అసెంబ్లీ భవనం, శాసనమండలి భవనం, హైకోర్టు తదితర మౌలిక సదుపాయాలకు కేంద్ర ప్రభుత్వము గ్రాంట్ రూపంలో నిధులు ఇవ్వాలి. సెక్షన్ 90 ప్రకారము పోలవరం బహుళార్థ సాధక ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వము త్వరలో పూర్తి చేసి జాతికి అంకితం ఇవ్వాలి. పైన పేర్కొన్న అంశాలన్నీ అమలై ఉండి ఉంటే ఈపాటికి నవ్యాంధ్ర స్వర్ణాంధ్ర ఉండేది . కానీ దురదృష్టవశాత్తు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మోసగారితనం, రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీల చేతగానితనంతో 12 సంవత్సరాలైనా ఇవి అమలుకు నోచుకోలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చి ఉంటే పైన పేర్కొన్న అంశాలన్నీ ఎప్పుడో అమలై ఉండేవి. రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలైన వైకాపా టిడిపిల మధ్య రోజూ సవతుల పోరు జరుగుతూ ఉంది. మావి గన్ పేరుతో వైకాపా సెల్ఫ్ గోల్ కొట్టు కుంటూ ఉండగా, అమరావతి పేరుతో టిడిపి సెల్ఫ్ డబ్బా కొట్టుకుంటూ రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేశాయి. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి గ్రాండ్, ఓల్డ్, గోల్డ్ పార్టీ అయిన కాంగ్రెస్ తోనే సాధ్యమని తులసి రెడ్డి అన్నారు.


### పులివెందులను ప్రశాంతమైన ప్రాంతంగా మార్చడమే నా లక్ష్యం
# రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

## నా పరిధిలో ఎక్కడ నేరం జరిగినా ఊరుకోను
## లాటి, బెల్ట్, గన్ వీటిలో
## ఏది ఉపయోగించే పరిస్థితి తేవద్దండి
## పులివెందుల అర్బన్ సీఐ శ్రీరామ్



**పులివెందుల - సూర్య వాస్తవం:** రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగకుండా ఉంటే చర్యలు తప్పవని, నా పరిధిలో ఎక్కడ నేరం జరిగిన సహించేది లేదు అని, గంజాయి, డ్రగ్స్, సైబర్ నేరాలు అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపి కఠిన చర్యలు తీసుకుంటామని పులివెందుల పట్టణ పరిధిలో 140 మంది రౌడీ షీటర్లు కు పులివెందుల అర్బన్ సీఐశ్రీరామ్ కౌన్సిలింగ్ ఇస్తూ లాటి, బెల్ట్, గన్ వీటిలో ఏది ఉపయోగించే పరిస్థితి తీసుకురావద్దని హెచ్చరిస్తూ శుక్రవారం పులివెందుల పోలీస్ స్టేషన్లో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చేసిన తప్పులను వదిలేసి, సమాజంలో గౌరవప్రదమైన పౌరులుగా జీవించాలని సూచించారు. రౌడీ షీటర్లు ఎవరైనా తప్పు చేస్తే తప్పుచేసిన దగ్గరి నుంచే కొట్టుకుంటూ స్టేషన్కు తీసుకొని వస్తానని, నా పరిధిలో ఎక్కడ నేరం జరిగినా సహించేది లేదు అని, అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే ఎంతటి వారి పైన చట్టరీత్యా చర్యలు చేపడతామని, పోలీసులు మర్యాదగా చెబుతున్న పుడు మారాల ని, లేని పక్షంలో లాఠీకి పని చెప్పడమే కాకుండా, అవసరమైతే పిస్టల్ వాడటానికి కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. మీ ప్రవర్తనను బట్టే మా చర్యలు ఉంటాయి అని ఆయన గట్టిగా హెచ్చరించారు. పట్టణంలో గంజాయి వినియోగం, విక్రయాల పట్ల అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని, యువత జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్న గంజాయి నెట్‌వర్క్‌పై సమాచారం ఇవ్వాలని కోరారు. నేరాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలతో పాటు జిల్లా బహిష్కరణ (నగర బహిష్కరణ) తప్పదని హెచ్చరించారు. ఇటీవల జరిగిన అల్లర్ల వీడియోలను పరిశీలిస్తున్నామని, గొడవలకు దిగిన ప్రతి ఒక్కరిపై కేసులు నమోదు చేస్తామని వెల్లడించారు. పోలీసులకు కులాలు, మతాలు లేదా రాజకీయ పార్టీలతో సంబంధం ఉండదని, కేవలం చట్టం ప్రకారమే విధులు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. పులివెందులను ప్రశాంతమైన ప్రాంతంగా మార్చడమే తమ లక్ష్యమని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సి.ఐ.శ్రీరామ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మధుసూదన్ రెడ్డి పోలీస్ సిబ్బంది రౌడీషీటర్లు తదితరులు పాల్గొన్నారు.

### ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో
# గేట్ 2026 విజయోత్సవ సమావేశం





**వేంపల్లె - సూర్య వాస్తవం** ఉన్నత విద్య పోటీ పరీక్షల విభాగపు సమన్వయకర్త డా. డి. కోనప్ప ఆధ్వర్యంలో ట్రిపుల్ ఐటీ లో గేట్ 2026 విజయోత్సవ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రొఫెసర్ కుమార స్వామిగుప్త మాట్లాడుతూ, గేట్ వంటి జాతీయ స్థాయి పరీక్షలో 5వ ర్యాంక్, 8వ ర్యాంకు, 22 వ ర్యాంక్, 53 వ ర్యాంక్, 84 వ ర్యాంక్ తో పాటు 36 మంది విద్యార్థులు 1000 లోపు జాతీయ ర్యాంకులు సాధించారాని, మొత్తంగా 155 మంది విద్యార్థులు జాతీయస్థాయి ర్యాంకులు సాధించారని తెలిపారు. విద్యార్థులు సాధించిన ఈ విజయాలు విశ్వవిద్యాలయ ప్రతిష్టను మరింత పెంచుతాయని, ఈ విజయాలు ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. పరిపాలనాధికారి డా. రవికుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు తమ ఉన్నత విద్య కోసం సరైన సంస్థలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఉన్నత కెరీర్ సాధనలో సంస్థ ఎల్లప్పుడూ మద్దతుగా ఉంటుందని తెలిపారు. కోనప్ప మాట్లాడుతూ, విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత ఫలితంగా ఈ విజయాలు సాధ్యమయ్యాయని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని విద్యార్థులను ప్రోత్సహించారు. అనంతరం గేట్ 2026 లో ర్యాంకులు సాధించిన విద్యార్థులతో కలిసి డైరెక్టర్ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అలాగే డైరెక్టర్ చేతులమీదుగా ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మెమెంటోలు, పశంసా పత్రాలు అందజేశారు. విజేతలు తమ అనుభవాలను పంచుకుంటూ, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ జి రమేష్, కంప్యూటర్ సైన్స్ విభాగపు అధిపతి డాక్టర్ రత్నకుమారి , సివిల్ డిపార్ట్మెంట్ అధిపతి ధనుంజయ, సహాయ ఆచార్యులు వీరేష్ షాజాద్, డా. వెంకటేష్, భాస్కరయ్య, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ డాక్టర్ తిరుపతిరెడ్డి మరియు ఇతర అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు.

## జిల్లాలో జలధార ప్రాజెక్ట్
## 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక
# సమర్థవంతంగా అమలు కావాలి

**భూగర్భ జలాల పెరుగుదలే నిజమైన కొలమానం - లక్ష్యం కావాలి**

**జలధార పనులపై మాత్రమే కాదు - ఫలితాలపై దృష్టి పెట్టాలి**

**కాస్కేడ్ బేసిన్ ఫీడర్ చానల్స్ పరిధిలో సహజ నీటి ప్రవాహం కు ఆక్రమణలు ఉంటే తొలగించండి**

**ఈనెల 15లోగా గుర్తించిన పనుల ప్రతిపాదనలు పంపాలి**

**జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**






**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** జిల్లాలో జలధార ప్రాజెక్ట్ 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక సమర్థవంతంగా అమలు కావాలి. ఇందులో భూగర్భ జలాల పెరుగుదలే నిజమైన కొలమానం - లక్ష్యం కావాలని నిశాంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం మదనపల్లి కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో... జిల్లాలో జలధార ప్రాజెక్ట్ 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలకు తీసుకోవాల్సిన చర్యలపై.. జల వనరుల శాఖ, డ్వామా, భూగర్భ జలాలు, సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఏపీడీలు, ఇంజనీరింగ్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులతో సమీక్ష సమావేశం నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో గత సెప్టెంబర్ జలధార కార్యక్రమం చేపట్టక ముందు పరిస్థితులు, చేపట్టిన తర్వాత వచ్చిన తీసుకున్న పనులు, కార్యాచరణ అమలు తద్వారా వచ్చిన ఫలితాలు, ప్రస్తుతం తీసుకోవాల్సిన చర్యలు, ఏ ఏ అంశాలలో దృష్టిపెట్టాలి, పనులను ఏ విధంగా గుర్తించాలి, గుర్తించిన వాటికి ఫలితం వచ్చేలా అధికారులు కృషి చేయాలన్న అంశాలను కలెక్టర్ స్వయంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించి అధికారుల్లో ఒక స్ఫూర్తి కలిగించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... ఒక బాధ్యత ఉత్సాహం స్ఫూర్తితో.. జలధార పనులపై మాత్రమే కాదు ఫలితాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఉన్న ప్రతి చెరువు ఎందుకు నీటితో ఫిల్ కాలేదు అన్న ప్రశ్నతో ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమం ఒక అంచనా జనరేట్ ప్రోగ్రామ్ కాదు. జిల్లాలో ప్రతి మండలంలో భూగర్భ జలాలు 6 నుండి 3 మీటర్ల స్థాయికి చేరుకోవడమే మన అంతిమ లక్ష్యం. ఇందుకు ఇరిగేషన్, ఎన్ఆర్ఈజీఎస్, ఎంపీడీవో, ఏపీవో, మండల్ వాటర్ రిసోర్స్ పర్సన్, ఇంజనీరింగ్ మరియు ఫీల్డ్ అసిస్టెంట్, మండల ప్రత్యేక అధికారులు ప్రతి ఒక్కరూ పూర్తి సమన్వయంతో కృషి చేసినప్పుడే అద్భుతమైన ఫలితం వస్తుందని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో చేపట్టిన జలధార కార్యక్రమం ఒక గేమ్ చేంజర్ అవుతుందని ముఖ్యమంత్రి గారు స్వయంగా పేర్కొన్నారని.. అన్ని జిల్లాల్లో ఇదొక మోడల్గా తీసుకొని అన్నమయ్య ప్లస్ అమలు చేయాలని రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లను ఆదేశించడం జరిగింది. ప్రస్తుతం కేంద్రం కూడా ఈ జలధార జలహారతి కార్యక్రమాన్ని అమలు చేయడానికి దృష్టి పెట్టడం నిజంగా మనందరికీ ఒక గర్వకారణం. ఇంతటి విజయాన్ని, ప్రశంసలు అందుకున్న మనపై.. ఈ వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు మరింత బాధ్యతను పెరిగేలా చేసిందని చెప్పారు. గత సంవత్సరం మనకు సైక్లోన్ వచ్చింది. కానీ ఈసారి నార్మల్ రైన్ ఫాల్ మాత్రమే ఉంటుంది. మైనర్ ఇరిగేషన్ ట్యాంక్స్ లలో నీరు నింపితే భూగర్భ జలాలు పెరిగి జలధార వస్తుంది. జిల్లాలో 67 ఫీజో మీటర్లు ఉన్నాయి. ఇవన్నీ బాగా పనిచేస్తున్నాయా లేదా అని పరిశీలించాలని సూచించారు. గత సంవత్సరం ఒక్క రూపాయి ఇవ్వకుండా ఎన్ఆర్ఈజీఎస్ పనుల ద్వారా జలధార చేయడం వల్ల 38 టిఎంసిల నీరు వచ్చింది. ప్రస్తుతం చేపడుతున్న పనులలో ఎక్కువ శాతం మిషనరీ లేకుండా చేసినప్పుడే ఎంపీడీవోల పనితనం తెలుస్తుంది. ఇందుకు అన్ని వనరులను వినూత్నమైన పద్ధతులను వినియోగించుకోవాలి. ఇందులో నరేగా, నీటిపారుదల శాఖల సమన్వయం ఎంతో ముఖ్యం. ఇప్పటికే ఉపాధి హామీలో ఫీడర్ చానల్స్, డీసిల్టేషన్, ఫారం పాండ్లు, కందకాలు, ఎమ్ఐ ట్యాంకులు తదితర పనులను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ లను ఒకచోట కూర్చోబెట్టి మంజూరు చేసిన పనులు కాకుండా ఇతర చేపట్టాల్సిన పనులను గుర్తించాలని చెప్పారు. కాస్కేడ్స్, మైనర్ ఇరిగేషన్ ట్యాంక్స్, ఫీడర్ ఛానల్ పై దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో 700 కాస్కేడ్స్ ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు గుర్తించడం జరిగిందన్నారు. ప్రతి మండలంలో ఎన్ని కాస్కేడ్స్ ఉన్నాయి, వాటి పరిధిలోని ట్యాంకులు గుర్తించాలి. సహజంగా ఎక్కడి నుంచి నీరు వస్తుంది ఎక్కడికి వెళ్తుంది అన్నది ప్రాథమికంగా గుర్తించాలన్నారు. నీటి సహజ ప్రవాహం దారిలో ఏవైనా ఆక్రమణలు ఉంటే తప్పనిసరిగా తొలగించాలన్నారు. ఇందుకు స్థానిక నీటి సంఘాల ప్రతినిధులు, ఊరి పెద్దలు సహకారం తీసుకోవాలని, అవసరమైతే పోలీసుల సహకారం కూడా తీసుకోవచ్చునని తెలిపారు. కాస్కేడ్స్ పనులను జాగ్రత్తగా పక్కాగా అమలు చేయాలన్నారు. అలాగే మేజర్, మైనర్, సబ్, మైక్రో బేసిన్ స్థాయిలో మిగులు(సర్ ప్లస్), లోటు(డెఫ్సిట్) ఉన్న వాటిని గుర్తించాలన్నారు. కాస్కేడ్స్ పరిధిలో బేసిన్, సబ్ బేసిన్, వాటర్ ట్యాంక్స్ ఉంటాయని వాటిని గుర్తించి ఒకదానితో ఒకటి లింక్ చేసే విధంగా పనులు చేయాలన్నారు. ఇందుకు ఎంపీడీవో, మండల వాటర్ రిసోర్స్ అధికారి, నరేగా, గ్రౌండ్ వాటర్, మండల ప్రత్యేక అధికారి అందరూ సమన్వయంగా పనిచేయాలన్నారు. జలధార కార్యక్రమం కింద చేపట్టే ఈ పనులలో ఎక్కడైనా మిషనరీ అవసరం అయినప్పుడు స్వచ్ఛందంగా ముందుకు వచ్చే దాతలను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. అలాంటివారికి సరైన సమయంలో సముచిత రీతిలో గౌరవించడం కూడా జరుగుతుందన్నారు. ఇది మనది అన్న భావనతో.. ఉత్సాహంతో, స్ఫూర్తితో పనిచేసి జలధార జలహారతి 100 రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఇన్చార్జి డిఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ విఠల్ ప్రసాద్, డ్వామా పిడి వెంకటరత్నం, జిఎస్డబ్ల్యూఎస్ అధికారి లక్ష్మీపతి, ఆర్డీవో శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఏపీడీలు, ఇంజనీరింగ్, ఫీల్డ్

# వడదెబ్బ తగిలి వ్యక్తి మృతి



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం:** మండలంలోని చౌటపల్లి గ్రామానికి చెందిన రామాంజనేయులు 36 అనే వ్యక్తి శుక్రవారం వడ దెబ్బతో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. బంధువులు పోలీసులకి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం గొల్లపల్లి కి చెందిన గంగాదేవితో వివాహమైందని మూడు సంవత్సరాలు ఇద్దరు కలిసి ఉన్నారని ఆ తర్వాత విడిపోయి రామాంజనేయులు మద్యానికి బానిస అయ్యాడని దీనికి తోడు రాయచోటి కడప జాతీయ రహదారి టోల్గేట్ వద్ద అంబులెన్స్లో పనిచేస్తూ జీవనసాగించేవాడని గురువారం డ్యూటీ దిగి ఇంటి వద్దనే ఉండి మధ్యాహ్నము గుగ్గిల్లా గుట్ట వద్దకు వెళ్లి మద్యం సేవించి అక్కడే అపస్మారక స్థితిలో పడిపో యాడని వడదెబ్బ తగిలిందని దీంతో స్థానికులు గమనించి వెంటనే తల్లిదండ్రు లకు సమాచారం అందించారని ఆ మేరకు సంఘటన స్థలానికి కుటుంబ సభ్యులు చేరుకొని పరిశీలించగా రామాంజనేయులు కొన ఊపిరితో ఉన్నాడని వెంటనే 108 ద్వారా స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే గొంతు ఆరిపోయి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని కుటుంబ సభ్యులు తెలిపారు.ఈ మేరకు పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు

## కొమ్మనుతల గ్రామంలో గ్రామ సభ,
# రౌడీ షీటర్స్ కదలికలపై ప్రత్యేక నిఘా

**లింగాల - సూర్య వాస్తవం** లింగాల పోలీస్ స్టేషన్ పరిధిలోని కొమ్మనుతల గ్రామంలో గ్రామ సభ, రౌడీ షీటర్స్ కదలికలపై ప్రత్యేక నిఘా, వారి ఇళ్లకు జియోటాగ్ , సైబర్ క్రైమ్ ,బాల్యవివాహాలు , చీటింగ్, సోషల్ మీడియా వల్ల కలిగే అనర్థాలు వంటి వాటిపై ప్రజలకు అవగాహన కార్యక్రమం పులివెందుల రూరల్ సి ఐ సీతారామిరెడ్డి లింగాల ఎస్.ఐ జగదీశ్వర్ రెడ్డి ల ఆధ్వర్యంలో నిర్వహించారు. శుక్రవారంజిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్లో భాగంగా రాత్రి వేళల్లో లింగాల మండలంలో కొమ్మనుతల గ్రామంలో పులివెందుల డి.ఎస్పీ బి. మురళి పర్యవేక్షణలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పులివెందుల రూరల్ సి ఐ సీతారామిరెడ్డి లింగాల ఎస్.ఐ జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ,పేకాట, గంజాయి, అక్రమ మద్యం, నాటు సారా విక్రయిస్తే అటువంటి వారిపై పోలీసు శాఖ పరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సైబర్ క్రైమ్, భూతగాదాలు, మహిళలు చిన్నారులపై జరిగే నేరాలు , చీటింగ్ , సోషల్ మీడియా పోస్టులు,పోక్స్ కేసుల వంటి వాటిపై గ్రామ సభ నిర్వహించారు. అదేవిధంగా నేరస్తులు, రౌడీ షీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు ప్రత్యేక నిఘా ఉంటుందని ఎక్కడైనా గొడవలు సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.నేరాల నియంత్రణ కోసం పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందని, అందులో భాగంగా ప్రజలు కూడా మీ గ్రామాలలో ఎక్కడైనా ఏ సమస్యలు ఉన్నా, అపరిచిత వ్యక్తులు ఎవరైనా సంచరిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని లింగాల పి.ఎస్ ఎస్.ఐ జగదీశ్వర రెడ్డి తెలియజేశారు. అందరూ కలసి మెలసి ఉండాలని సూచించారు.ఈ గ్రామ సభలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



## బ్రహ్మరథోత్సవం ను పరిశీలించిన
## మఠాధిపతి శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాములవారు





**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం:** జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠంలో ఈనెల లో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాల భాగంగా ఈనెల 27న బ్రహ్మ రథోత్సవం ఉన్న సందర్భంగా శుక్రవారం శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం మఠాధిపతి వీరధర్మజ వెంకటాద్రి స్వాములు వారు రథమును పరిశీలించారు. రథముకు సంబంధించిన మరమ్మత్తులను పూర్తిచేయాలని రథశిల్పుల కు ఆదేశాలు జారీ చేశారు. అలాగే షట్టర్ పూర్తిగా తయారు చేస్తామన్నారు. అలాగే శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మఠం పరిసర ప్రాంతాల్లోని, మఠం సిబ్బందికి, మాడవీధులు అన్నిటిని కూడా పరిశుభ్రంగా ఉంచాలని షాపుల వారికి సూచించారు.

**జిల్లా నూతన ఇన్స్పెక్టర్గా బాధ్యతలు చేపట్టిన ఎం. రవికుమార్..**

## జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లిని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన అధికారి



**మదనపల్లె, ఏప్రిల్ 10:** అన్నమయ్య జిల్లా లో నూతన ఇన్స్పెక్టర్ గా ఎం. రవికుమార్ గారు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మదనపల్లి లోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి, ఐపీఎస్ గారిని మర్యాదపూర్వకంగా పూలమొక్కను అందజేసి కలిశారు. ఎం. రవికుమార్ గారు పోలీసు శాఖలో తన ప్రస్థానాన్ని 2009లో సబ్ ఇన్స్పెక్టర్ గా ప్రారంభించారు. తన సుదీర్ఘ సర్వీసులో అనంతపురం, చిత్తూరు జిల్లాలతో పాటు రైల్వే శాఖలోనూ బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం ఇన్స్పెక్టర్ గా పదోన్నతి పొందిన ఆయన, అత్యంత కీలకమైన గ్రేహౌండ్స్ విభాగంలోనూ పనిచేశారు. తాజాగా బదిలీపై అన్నమయ్య జిల్లాకు విచ్చేసి నేడు బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు నూతన ఇన్స్పెక్టర్ కు అభినందనలు తెలుపుతూ పలు కీలక సూచనలు చేశారు. “జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమైంది. నూతనంగా బాధ్యతలు చేపట్టిన రవికుమార్ గారు తన అనుభవంతో జిల్లాలోని పోలీసు సిబ్బందిని సమన్వయపరుస్తూ, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని, ప్రజల రక్షణ కోసం నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, పోలీసు శాఖ ప్రతిష్టను మరింత పెంచేలా కృషి చేయాలి.” అని ఆదేశించారు.

## పాతపేట బీబీ జైనబ్ దర్గాను సందర్శించిన ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్



**ఉరవకొండ - సూర్య వాస్తవం:**ఆర్థికమంత్రి మంత్రి పయ్యావుల కేశవ్ ఉరవకొండలోని బీబీ జైనబ్ దర్గాను సందర్శించడంపై ప్రజల పట్ల వారికున్న మన్ననను, సామాజిక సామరస్యాన్ని ప్రతిబింబిస్తుంది. పాతపేటలోని దర్గా వద్ద మత పెద్దలు ఆర్థికమంత్రికి ఇస్లాం సాంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికారు.ఆయన సేవలను గుర్తిస్తూ దర్గా కమిటీ సభ్యులు మరియు పెద్దలు ఆయనను శాలువాతో సన్మానించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ముఖ్యంగా ఉరవకొండ నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన ప్రత్యేక ప్రార్థనలు (దువా) చేశారు.?మంత్రి పయ్యావుల కేశవ్ ఎప్పుడూ తన నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తుంటారు. ఈ సందర్శన కేవలం ఒక ఆధ్యాత్మిక కార్యక్రమమే కాకుండా, అన్ని వర్గాల ప్రజలతో ఆయనకు ఉన్న అనుబంధాన్ని, మత సామరస్యాన్ని చాటిచెబుతోంది.రాష్ట్ర ఆర్థిక మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న కేశవ్ అభివృద్ధి పనులతో పాటు ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం స్థానికంగా సానుకూల వాతావరణాన్ని నింపుతుంది. ఈ కార్యక్రమం లో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ తో పాటు ముస్లిం మత పెద్దలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని రాష్ట్రము సుభిక్షంగా ఉండాలని ప్రార్థనలు చేశారు.

# రోడ్డు ప్రమాదం దురదృష్టకరం

## మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె - సూర్య వాస్తవం :** రాయచోటిలో సీనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న వేంపల్లె క్రిస్టియన్ కాలనీకి చెందిన కందా శేఖర్, చక్రాయపేట మండలం చిలే కాంపల్లికి చెందిన మోకా నాగిరెడ్డి గురువారం రోడ్డు ప్రమాదంలో మరణించారు. వారి పార్థివదేహాలను వేంపల్లె ప్రభుత్వాసుపత్రి మార్చురీ లో రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి, మహిళా కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షురాలు శ్యామలమ్మ,పదవీ విరమణ చెందిన వార్డెన్ నాగన్న, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, నామా వినయ్ సందర్శించారు. వారి పవిత్ర ఆత్మకు భగవంతుడు ప్రశాంతిని ప్రసాదించాలని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులను బంధుమిత్రులను ఓదార్చారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే నా లక్ష్యం

## ప్రజా దర్బార్'లో బీటెక్ రవి



**సింహాద్రిపురం-సూర్య వాస్తవం:** పులివెందుల నియోజకవర్గ ప్రజల కష్టాలను తీర్చి, వారికి అండగా ఉండటమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని శుక్రవారం సింహాద్రిపురంలోని తన స్వగృహంలో నిర్వహించిన 'ప్రజా దర్బార్'లో బి టెక్ పేర్కొన్నారు. వాటిలో భాగంగాప్రజల నుండి వినతులు స్వీకరించడం జరిగింది.నియోజకవర్గం నుంచి వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజల సమస్యలను ఓపికగా విన్న ఆయన, అక్కడికక్కడే సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు తానూ ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, భరోసా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజలు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీలకు అండగా నిలిచి సమస్య పరిష్కరిస్తా: బీటెక్ రవి



**తొండూరు - సూర్య వాస్తవం:** పులివెందుల నియోజకవర్గం తొండూరు మండలం మల్లెల గ్రామం గుండా వెళ్తున్న హైవే రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా స్థానిక మసీదుకు ఆటంకం కలగడంపై గ్రామంలోని మైనార్టీ పెద్దలు ఆందోళన వ్యక్తం చేస్తూ ఈ విషయాన్ని పులివెందుల టీడీపి ఇంచార్జ్ బీటెక్ రవి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామానికి విచ్చేసిన బీటెక్ రవి మైనార్టీ సోదరుల విన్నపాన్ని మన్నించి వెంటనే క్షేత్రస్థాయిలో మసీదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మతపరమైన కట్టడాలకు ప్రాముఖ్యతనిస్తూ, భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చూస్తామని భరోసా ఇచ్చారు. వెంటనే సంబంధిత హైవే కాంట్రాక్టర్‌తో ఫోన్లో మాట్లాడి, మసీదుకు ఎటువంటి నష్టం కలగకుండా లేదా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సమస్యను ఎలా పరిష్కరించాలో చర్చించి, సాధ్యమైనంత త్వరగా ఈ సమస్యకు ముగింపు పలుకుతానని గ్రామస్తులకు ఘనంగా మాట ఇచ్చారు. బీటెక్ రవి తక్షణ స్పందన పట్ల మల్లెల గ్రామ మైనార్టీ పెద్దలు మరియు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు చింతకుంట నాగిరెడ్డి, తొండూరు మండల సింగిల్ విండో సోసెటి అధ్యక్షుడు సూర్యనారాయణ రెడ్డి,శివ భాస్కర్ రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు..

# పార్టీ కోసం కష్టపడిన విశ్వాసానికి దక్కిన ప్రతిఫలం

## రైతు సేవకు కొత్త బాధ్యత



**శింగనమల - సూర్య వాస్తవం:** అనంతపురం జిల్లా, సింగనమల నియోజకవర్గం, సింగనమల మండలంలోని దిగువ నరసాపురం గ్రామానికి చెందిన మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు బొమ్మన శ్రీరామ్ రెడ్డి వైయస్సార్సీపి రాష్ట్ర రైతు విభాగం జనరల్ సెక్రటరీగా ఎంపిక చేసినారు. ఈ సందర్భంగా బొమ్మన శ్రీరామ్ రెడ్డి మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఈ కీలక బాధ్యత అప్పగించిన వైఎస్ఆర్సిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని అన్నారు.అలాగే ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డికి, సింగనమల నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త మాజీమంత్రి డాక్టర్ సాకే శైలజనాథ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రైతు సమస్యల పరిష్కారం కోసం మరింత కృషి చేస్తూ, పార్టీ ఆశయాలను గ్రామస్థాయిలో బలోపేతం చేస్తానని ఆయన స్పష్టం చేశారు.రైతు సంక్షేమమే లక్ష్యంగా పార్టీ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని బొమ్మన శ్రీరామ్ రెడ్డి తెలిపారు




# ఫీజు చెల్లిస్తేనే బడిలోకి..!

- స్కూల్ ఫీజు కట్టలేదని మూడు నెలలుగా అనుమతించిన యజమాన్యం
- విద్యా హక్కు చట్టాన్ని తుంగలో తొక్కిన ఆదోని నేషనల్ హై స్కూల్
- స్కూల్ యాజమాన్యంపై జిల్లా కలెక్టర్ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

**కర్నూలు క్రైమ్ - సూర్య వాస్తవం :** మంచి, చెడులు చెప్పాల్సిన విద్యాసంస్థల్లో రోజురోజుకు మానవత్వం మంటగలిసి పోతోంది. స్కూలు ఫీజు కట్టలేదని ఓ ప్రైవేటు స్కూలు యాజమాన్యం విద్యార్థులను మూడు నెలలుగా స్కూలుకు అనుమతించలేదు . ఈ ఘటన కర్నూలు జిల్లా ఆదోనిలో స్థానిక నేషనల్ స్కూల్లో చోటుచేసుకున్నా ఈ ఘటన స్థానికంగా కలకలం రేపుతుంది.... అసలు వివరాల్లోకి వెళితే......అదోని పట్టణంలోని నేషనల్ హై స్కూల్‌లో చదువుతున్న మొహమ్మద్ (8వ తరగతి), ఇమ్రాన్ (3వ తరగతి) అనే విద్యార్థులను, గత మూడు నెలలుగా స్కూల్ ఫీజులు చెల్లించలేదనే కారణంతో పాఠశాలలోకి అనుమతించకుండా, అకాడమిక్ పరీక్షలు కూడా రాయనివ్వకుండా నిలిపివేశారు. వారి తండ్రి పలు మార్లు అభ్యర్థన చేసిన పాఠశాల నిర్వాహకులు వారిపై దయ చూపకుండా పిల్లలను విద్య నుండి దూరం చేస్తున్నరని విద్యార్థి సంఘాలు, విద్యావేత్తలు యాజమాన్య వైఖరిపై మండిపడుతున్నారు. ఇది విద్య హక్కు చట్టాన్ని తుంగలో తొక్కిన స్కూల్ యాజమాన్యం పై సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విద్యార్థులను తిరిగి పాఠశాలలో చేర్చించి వారి చదువును కొనసాగించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు.ఈ ఘటనకు బాధ్యులైన స్కూల్ కరస్పాండెంట్ పై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ప్రైవేట్ స్కూల్స్ అధిక ఫీజులు వసూలు చేస్తే.. వాటి అనుమతులు రద్దు చేసేలా నిబంధనలను కఠినతరం చేయాలని ప్రభుత్వ పాలకులు చెప్పిన యజమాన్యం వాటిని పెడచవున పెడుతున్న స్కూల్ యాజమాన్యాలపై జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు

> **విద్యా హక్కు చట్టం (ఆర్ టీ ఈ -2009) అమలులో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. ప్రైవేట్ స్కూళ్లలో 25% సీట్లు పేదలకు దక్కకపోవడం మౌలిక సదుపాయాల లేమి, సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపంతో చట్టం నీరుగారుతోంది. నాణ్యమైన విద్య అందక ఫీజుల దోపిడీతో పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు**

## శాటిలైట్ సిటీ రుద్రభారతిపేటలో

# కరెంటోళ్ల జన బాట

- ప్రజలతో కరెంటు సమస్యలపై ఆరా
- విద్యుత్ శాఖ ఎస్ఈ సోమ శ్రీనివాసులు పర్యటన



**సూర్య వాస్తవం - చెన్నూరు:** వేసవిలో విద్యుత్ వినియోగం యోగం ఎక్కువగా ఉండి ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిపోయే ప్రమాదం ఉంటుందని అలాగే వర్షాకాలంలో కూడా ప్రజలు విద్యుత్ వైర్లకు దూరంగా ఉండాలని విద్యుత్ శాఖజిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ సోమ శ్రీనివాసులు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరి సేమియా నాయక్ లు అన్నారు. కరెంటోళ్ల జనాబాట కార్యక్రమంలో భాగం గా వారు శుక్రవారం మండలం లోని రుద్ర భారతి పేట, శాటిలైట్ సిటీ నందు పర్యటించి అక్కడి ప్రజలతో కరెంటు పనితీరు సమస్యలపై మాట్లాడడం జరిగింది.విద్యుత్ కనెక్షన్ల విషయంలో, మీటర్ల పనితీరులో విద్యుత్తు లైన్ల సమస్య విషయం లో అదేవిధంగా విద్యుత్ సిబ్బంది యొక్క పనితీరులో ఏవైనా సమస్యలు ఉన్నాయా అని వారు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రుద్రభారతిపేట, శాటిలైట్ సిటీ నందు వారు ఇంటింటికి వెళ్లి అక్కడి ప్రజలతో మమేకమై విద్యుత్ విద్యుత్ వాడకంపై, విద్యుత్ సమస్యలపై, తీసుకోవలసిన ప్రజలకు అవగాహన కల్పించారు. అంతేకాకుండా వేసవిలో, వర్షాకాలంలో విద్యుత్ పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ పట్ల ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే విద్యుత్ సిబ్బందికి కాని, విద్యుత్ అధికారులకు గానీ సమాచారం అందించాలని, అలాగే ఏవైనా ఫిర్యాదులు ఉంటే తెలియజేయాలని వారు అక్కడి ప్రజలకు తెలియజేశారు. ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కారం చేసే అవకాశం ఉందని అందుకొరకే మేమంతా ప్రజల వద్దకే వచ్చి ప్రజల విద్యుత్ సమస్యలపై అడగడం జరుగు తుందని ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు అందరు కూడా సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు. విద్యుత్ సమస్యలపై సావధానంగా విన్న ప్రజలు విద్యుత్ అధికారులే తమ వద్దకు వచ్చి తమ సమస్యలు అడిగి వాటి పరిష్కారం దిశగా చూపడంతో ప్రజలు విద్యుత్ శాఖ తీరుపై హర్షం వ్యక్తం చేశారు... అనంతరం అసిస్టెంట్ ఇంజనీర్ బండి రామలింగారెడ్డి మాట్లా డుతూ, 11వ తేది రెండవ శనివారం కాబట్టి 33 కెవి లైన్ల ల్లో లెవెన్ కె.వి లైన్ల ల్లో మరమ్మత్తులు చేపట్టడం జరుగు తుందని ఉదయం 8 గంటల నుండి, మధ్యాహ్నం 12:30 గంటల వరకు చెన్నూరు మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందని ప్రజలు గమనించగలరని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఇంజనీర్ స్రవంతి దేవి, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్మెన్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పందులను అరికట్టడంలో అధికారుల నిర్లక్ష్యం

## -సీపీఎం మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్ డిమాండ్




**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం:** బహ్మంగారిమఠంలో పందులను అరికట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సిపిఎం మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం వారు స్థానిక సిపిఎం కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ...బ్రహ్మంగారి మఠం మండల కేంద్రంలో పందుల బెడద తీవ్రంగా ఉందని నిత్యం భక్తులకు అసౌకర్యం కలుగుతుందని అనేక సార్లు అధికారులకు పిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. దీని కారణంగా శుక్రవారం ఉదయం స్థానిక బాలికల హైస్కూల్ లో పందులు విద్యార్థులపై దాడి చేయడం జరిగిందని వారు తెలిపారు. సమయానికి ఉపాధ్యాయులు స్పందిండం వల్ల పెద్ద ప్రమాదమే తప్పిందని వారు అన్నారు. పందులను అరికట్టాలని బయటకు తరలించాలని పలుమార్లు అధికారులకు తెలిపిన, ఆందోళన చేసినప్పటికీ పందులను బయటకు తరలించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని వారు తెలిపారు. పందుల యజమానులతో అధికారులు కుమ్మక్కై విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ పందులను వదలడం వల్ల భక్తులకు, ప్రజలకు, విద్యార్థులకు సమస్యగా ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పందులన్నింటినీ అరికట్టి బయటకు తరలించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ప్రముఖ పుణ్య క్షేత్రమైన టువంటి బ్రహ్మంగారి మఠంలో భక్తులకు అసౌకర్యం కలిగించకుండా ఇప్పటికైనా అధికారుల స్పందించి పందులను నివారించాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రత్యక్షంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు సాన గోవింద్, హరి లు పాల్గొన్నారు.

# టీనేజ్ అమ్మాయికి నాన్నగా మెగాస్టార్!




మెగాస్టార్ చిరంజీవి మళ్లీ తన మార్క్ ఎమోషనల్ డ్రామాతో అలరించడానికి సిద్ధమవుతున్నారా? అంటే సన్నివేశం అలాగే కనిపిస్తోంది. బాబీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రంలో చిరంజీవి టీనేజ్ అమ్మాయికి తండ్రిగా నటించబోతున్నట్లు సమాచారం. దీంతో ఈ పాత్రపై ఆసక్తి నెలకొంది. గతంలో -చూడాలని ఉంది-, -డాడీ-, -స్టాలిన్- వంటి చిత్రాల్లో తండ్రి పాత్రలో మెప్పించిన చిరంజీవి చాలా కాలం తర్వాత మళ్లీ పూర్తి స్థాయి తండ్రి-కూతుళ్ల సెంటిమెంట్ చుట్టూ తిరిగే కథను ఎంచుకోవడం విశేషం. ఈ ప్రచారం మెగా అభిమానుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపుతోంది.

ఈ సినిమా కథా నేపథ్యం ప్రధానంగా కోల్‌కతా నగరంలో సాగుతుందని తెలుస్తోంది. గతంలో కోల్‌కతా నేపథ్యంలో -చూడాలని ఉంది- బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించింది. మళ్లీ అదే బ్యాక్‌డ్రాప్‌లో, ఒక పవర్ ఫుల్ మాఫియా కథకు తండ్రి-కూతుళ్ల ఎమోషన్ తోడైతే ఫలితం అద్భుతంగా ఉంటుందని బాబీ భావిస్తున్నట్లున్నారు. ఈ సినిమాలో చిరంజీవి పాత్ర కేవలం సెటిల్డ్ గానే కాకుండా తన కూతురి కోసం ఏదైనా చేసే గంభీరమైన వ్యక్తిగా ఉంటుందని సమాచారం. చిరంజీవి కుమార్తె పాత్ర కోసం చిత్ర యూనిట్ ఓ యంగ్ హీరోయిన్ కోసం అన్వేషిస్తోందని తెలిసింది.

అనస్వర రాజన్ లేదా ప్రీతి ముకుందన్ వంటి వర్ధమాన నటీమణుల పేర్లు పరిశీలనలో ఉన్నాయి. ఒక తండ్రిగా చిరంజీవి చేసే పోరాటం వారి మధ్య ఉండే అనుబంధం ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తాయని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. యాక్షన్ సినిమాల హవా నడుస్తోన్న కాలంలో మెగాస్టార్ తన ఇమేజ్‌ను పక్కన పెట్టి కథకు ప్రాధాన్యతనిస్తూ ఇలాంటి పాత్రను ఎంచుకోవడం ఆసక్తికరం. ఈ చిత్రం కోసం చిరంజీవి తన లుక్ పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. టీనేజ్ అమ్మాయికి తండ్రిగా కనిపించడమే కాకుండా? సినిమాలోని ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్లలో మరింత స్టైలిష్ గా, యంగ్ గా కనిపించనున్నట్లు సమాచారం.

బాబీ మునుపటి చిత్రం -వాల్తేరు వీరయ్య-లో చిరంజీవిలోని మాస్ కోణాన్ని ఆవిష్కరించగా ఈ సినిమాలో మాత్రం క్లాస్ మాస్ ఎలిమెంట్స్ తో పాటు బలమైన సెంటిమెంట్ ను మిక్స్ చేస్తున్నారని తెలుస్తోంది. ఇది పక్కా బాబి మార్క్ ఎంటర్ టైనర్. అందులో ఎలాంటి డౌట్ లేదు. ఆయన ఎలాంటి కథను తీసుకున్నా? కమర్శియల్ గా కనెక్ట్ చేయడంలో దిట్ట. అందుకే మెగాస్టార్ కూడా పెద్దగా ఆలోచించకుండానే బరిలోకి దిగిపోతున్నారు. 2027లో విడుదల కానున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. చిరంజీవి మరోసారి అద్భుతమైన నటనతో తండ్రి పాత్రలో మెప్పించి బాక్సాఫీస్ వద్ద మెగా సునామీ సృష్టిస్తారని అభిమానులు ఆశిస్తున్నారు.

# 'స్పిరిట్' సెట్‌లో అగ్నిప్రమాదం




కథానాయకుడు ప్రభాస్, సందీప్‌రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'స్పిరిట్' షూటింగ్ సెట్లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటన జరిగినప్పుడు ప్రభాస్ సెట్లో లేరు. యూనిట్ సభ్యుల్లో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే అతడిని సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగా ఉందని సమాచారం. అగ్నిప్రమాదం వల్ల సెట్‌లో వేసిన కొన్ని టెంట్లు, షూటింగ్‌కు సంబంధించిన పరికరాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. పెద్ద ప్రమాదం తప్పిపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

# 'మైఖేల్' ఫైనల్ ట్రైలర్ విడుదల



మైఖేల్ జాక్సన్ బయోపిక్ 'మైఖేల్' ఫైనల్ ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ చిత్రంలో మైఖేల్ జాక్సన్ మేనల్లుడు జాఫర్ జాక్సన్ టైటిల్ రోల్ పోషిస్తున్నారు. దర్శకుడు ఆంటోయిన్ ఫుక్వా తెరకెక్కించిన ఈ ట్రైలర్‌లో 'బీట్ ఇట్', 'థ్రిల్లర్', 'బిల్లీ జీన్' వంటి ఐకానిక్ సాంగ్స్ ప్రదర్శనలతో పాటు, మైఖేల్ వ్యక్తిగత జీవితంలోని భావోద్వేగ అంశాలను, బాల్యంలో ఆయన ఎదుర్కొన్న సంఘర్షణలను, వివాదాలను ఎంతో ఆకట్టుకునేలా చూపించారు. ఆస్కార్ విజేత గ్రాహమ్ కింగ్ నిర్మించిన ఈ చిత్రంలో కోల్‌మన్ డొమింగో, నియా లాంగ్, మైల్స్ టెల్లర్ వంటి హాలీవుడ్ ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషించారు. కేవలం ఒక సంగీత ప్రయాణంలా కాకుండా, ఒక లెజెండరీ స్టార్ జీవితంలోని ఎత్తుపల్లాలను ఆవిష్కరించేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు తెలుస్తోంది. ఏప్రిల్ 24న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది.



# ఆదుకున్న పాటిధర్, వెంకటేశ్ అయ్యర్

## - రాజస్థాన్ రాయల్స్ లక్ష్యం 202పరుగులు
## - సూర్యవంశీ 15బంతుల్లోనే అర్ధసెంచరీ



**గౌహతి:** రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) కెప్టెన్ రజత్ పాటిదార్(63) అర్ధ శతకానికి తోడు చివర్లో వెంకటేశ్ అయ్యర్ మెరుపులు మెరిపించారు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 201 పరుగుల భారీస్కోర్ చేసింది. ఓవైపు వికెట్లు పడుతున్నా అటాకింగ్ గేమ్‌తో విరుచుకుపడిన పాటిదార్ భారీ స్కోర్‌కు బాటు వేశాడు. విరాట్ కోహ్లీ(32), రొమారియో షెపర్డ్(22), ఇంప్యాక్ట్ సబ్ వెంకటేశ్ అయ్యర్(29 నాటౌట్) చివరి ఓవర్లో 4, 6, 6 బాదడంతో ఆర్సీబీ 201 పరుగులు చేసింది. వర్షం కారణంగా ఆలస్యంగా ప్రారంభమైన మ్యాచ్‌లో ఆర్సీబీకి శుభారంభం దక్కలేదు. ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే ఫిలిప్ సాల్ట్(0)ను జోఫ్రా ఆర్చర్ వెనక్కి పంపాడు. బౌండరీలతో చెలరేగిన దేవ్‌దత్ పడిక్కల్(14)ను హిట్‌మైర్ డైవింగ్ క్యాచ్‌తో పెవిలియన్ పంపగా.. రవి బిష్ణోరు ఓవర్లో షాట్‌కు యత్నించిన విరాట్ కోహ్లీ(32) క్లీన్‌బౌల్డయ్యాడు. దీంతో పవర్ ప్లే 6ఓవర్లలో బెంగళూరు 58 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. ఆ దశలో కెప్టెన్ రజత్ పాటిదార్(63), కృనాల్ పాండ్యా(1)తో భాగస్వామ్యం నిర్మించాలనుకున్న దశలో కనాల్ పాండ్యాను బిష్ణోరు డగౌట్ చేర్చాడు. అతడి ఓవర్లో బిగ్ షాట్ ఆడబోయి హిట్‌మైర్‌కు దొరికిపోయాడు. బిగ్ హిట్టర్ టిమ్ డేవిడ్ కూడా నేరుగా హిట్‌మైర్ చేతుల్లో చిక్కి ఔటవ్వగా.. బిష్ణోరు ఓవర్లో సిక్సర్‌తో రొమారియో షెపర్డ్(22) సిక్సర్‌తో బెంగళూరు స్కోర్ వంద దాటింది. బౌండరీలతో ప్రమాదకరంగా మారిన రొమారియో షెపర్డ్(22)ను జడేజా బోల్తా కొట్టించగా ఆర్సీబీ ఏడో వికెట్ పడింది. అర్ధ శతకంతో రాణించిన పాటిదార్‌ను సందీప్ శర్మ ఔట్ చేశాక ఆర్సీబీ స్కోర్ వేగం మందగించింది. సందీప్ శర్మ వేసిన 20వ ఓవర్లో ఇంప్యాక్ట్ సబ్ వెంకటేశ్ అయ్యర్(29 నాటౌట్) వరసగా 4, 6. 6 బాదడంతో బెంగళూరు భారీస్కోర్ చేసింది. రాజస్తాన్ రాయల్స్ బ్యాటర్లు బ్రిజేశ్ శర్మ, ఆర్చర్, బిష్ణరుకు రెండేసి, సందీప్ శర్మ, జడేజాకు ఒక్కో వికెట్ దక్కాయి.

భారీ ఛేదనలో భాగంగా రాజస్తాన్ రాయల్స్ జట్టు పవర్‌ప్లే 6ఓవర్లు ముగిసేసరికి వికెట్ నష్టానికి 97పరుగులు చేసింది. ఇక 15ఏళ్ల యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ 15బంతుల్లోనే అర్ధ సెంచరీ కొట్టి భారీ లక్ష్యాన్ని మరింత కుదించాడు.

స్కోర్‌బోర్డు...

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: సాల్ట్ (సి)ధృవ్ జురెల్ (బి)ఆర్చర్ 0, కోహ్లి (బి)బిష్ణోరు 32, పడిక్కల్ (సి)హెట్‌మైర్ (బి)ఆర్చర్ 14, పటీధర్ (సి)ఫెర్రేరా (బి)సందీప్ శర్మ 63, కృనాల్ పాండ్య (సి)హెట్‌మైర్ (బి)బిష్ణోరు 1, జితేశ్ శర్మ (ఎల్‌బి)బ్రిజేశ్ శర్మ 5, టిమ్ డేవిడ్ (సి)హెట్‌మైర్ (బి)బ్రిజేశ్ శర్మ 13, షెఫర్డ్ (సి)బ్రిజేశ్ శర్మ (బి)రవీంద్ర జడేజా 22, వెంకటేశ్ అయ్యర్ (నాటౌట్) 29, భువనేశ్వర్ కుమార్ (నాటౌట్) 9, అదనం 13. (20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 201పరుగులు. వికెట్ల పతనం: 1/0, 2/45, 3/58, 4/62, 5/76, 6/94, 7/125, 8/166 బౌలింగ్: ఆర్చర్ 3-0-33-2, బర్గర్ 3-0-32-0, సందీప్ శర్మ 4-0-47-1, బిష్ణోరు 4-0-32-2, జడేజా 2-0-14-1, బ్రిజేశ్ శర్మ 4-0-37-2.

# సెమీస్‌కు ఆయుశ్

## - క్వార్టర్‌ఫైనల్లో మూడో సీడ్‌పై సంచలన విజయం



**నింగ్బో(చైనా):** ఆసియా బ్యాడ్మిం టన్ ఛాంపియన్‌షిప్‌లో ఆయుశ్ శెట్టి పెను సంచలనాన్ని నమోదు చేశాడు. క్వార్టర్‌ఫైనల్లో ఏకంగా 3వ ర్యాంకర్, ఇండోనేషియాకు చెందిన జొనాథన్ క్రిస్టీను ఓడించి సెమీస్‌కు చేరాడు. ప్రి క్వార్టర్స్‌లో భారత షట్లర్ల పోరాటం ముగిసినా.. క్వార్టర్స్‌కు చేరి ఆశలు రేపిన 20 ఏళ్ల ఆయుశ్ శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో 23-21, 21-17తో జోనాథన్ క్రిస్టీని చిత్తుచేశాడు. హోరాహోరీగా సాగిన తొలి సెట్‌ను 23-21తో గెలుచుకున్న ఆయుశ్... రెండో సెట్ అర్ధభాగం ముగిసేసరికి 10-9పాయింట్లతో ఆధిక్యతలో నిలిచాడు. ఆ ఆధిక్యతను చివరివరకు కనబరుస్తూ.. చివర్లో వరుసగా మరో రెండు పాయింట్లు సాధించి మ్యాచ్‌ను ముగించాడు. ఈ గేమ్ సుమారు 54 నిమిషాలసేపు సాగింది. ప్రి క్వార్టర్స్‌లో హెచ్‌హెస్ ప్రణరు, సింధు ఓటమిపాలైనా.. పతకంపై ఆశలను సజీవంగా నిలుపుకున్నాడు. తొలి రౌండ్‌లోనే ఏడో ర్యాంకర్ చైనా ఆటగాడిని ఇంటికి పంపిన ఆయుశ్ అదే ఊపులో ప్రి క్వార్టర్స్‌లో 25వ ర్యాంకరైన చీ యూ జెన్(చైనీస్ తైపీ)ను వణికించాడు. క్వార్టర్స్‌లోనూ జోరు చూపించిన భారత షట్లర్ జొనాథన్ క్రిస్టీకి చెక్ పెట్టాడు. శనివారం జరిగే సెమీస్‌లో ఆయుశ్ శెట్టి టాప్‌సీడ్, థారులాండ్‌కు చెందిన విదిత్‌శరణ్‌తో తలపడనున్నాడు.

# విశ్వనాథ్‌కు స్వర్ణం

## - ఆసియా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్



**ఉలాన్‌బాతర్(మంగోలియా):** ఆసియా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పురుషుల విభాగంలో 21ఏళ్ల విశ్వనాథ్ స్వర్ణ పతకంతో మెరిసాడు. శుక్రవారం జరిగిన 50కిలోల విభాగం ఫైనల్లో విశ్వనాథ్ 5-0తో జపాన్‌కు చెందిన డైచీ ఇవారును ఓడించాడు. 'గెలుపు వార్తకోసం మా నాన్నగారు స్వగ్రామంలో టైలరింగ్ షాప్‌లో నా ఫోన్ కోసం ఎదురు చూస్తున్నారు. ఫోన్ మోగగానే 'నేను గెలిచాను.. అని చెప్పగానే ఆయన ఆనందబాష్పాలతో తనకు శుభాకాంక్షలు తెలిపారని' పేర్కొన్నాడు. విశ్వనాథ్ తండ్రి మాజీ బాక్సింగ్ ఛాంపియన్. అతను బాక్సింగ్‌ను విడిచి 26ఏళ్ల తర్వాత విశ్వనాథ్ ఈ క్రీడల్లో బంగారు పతకం సాధించడం విశేషం.

## ప్రకృతి వ్యవసాయంలో
# కూరగాయలు ఆరోగ్యానికి రక్ష





**లింగాల -సూర్య వాస్తవం:** ఆరోగ్యానికి రక్షబి ప్రకృతి వ్యవసాయంలో పండిన కూరగాయలు ఎంతగానో దోహదపడతాయని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పేర్కొన్నారు. లింగాల మండలంలోని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పండించినటువంటి పురుగుమందులు, రసాయనాలు లేని కూరగాయలు ఆకుకూరలను లింగాల మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాళ్లు పెట్టి అమ్మడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందితోపాటు ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ప్రసన్న కుమార్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలలో మా సిబ్బంది పండించినటువంటి పురుగుమందులు రసాయనాలు లేని ఆకుకూరలు కాయగూరలను వైద్య సిబ్బంది మరియు రోగులు రైతులు వినియోగించుకొని ఆరోగ్యంగా ఉండాలని తెలియజేశారు. అలాగే ప్రతి నెల ఇక్కడ ఏదో ఒక వారంలో స్టాళ్లు నిర్వహిస్తామని అందుకు వైద్య సిబ్బంది సహకరించాలని తెలియజేశారు. అదేవిధంగా మండల ఇన్చార్జి జయ నాయక్ మాట్లాడుతూ మా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పండించి నటువంటి ఆకుకూరలు కూరగాయలు, ఇతర ఆహార ధాన్యాలు, పండ్లను డిమాండ్ కు తగినట్టు సప్లై చేస్తామని, అందుకు కొద్దిగా అధిక ధరలు మా రైతులకు ఇవ్వవలసి ఉంటుందని అందుకు వినియోగదారులు అర్థం చేసుకోవాలని తెలియజేశారు . మోడల్ మేకర్ యామినీ లత మాట్లాడుతూ కెమికల్ ద్వారా పండించే ఉత్పత్తులు నాణ్యత లేనివిగా ఉంటాయని, వాటి ద్వారా ఆరోగ్యానికి హానికరమని, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు ప్రత్యేక ధరలు ఉంటే రాబోవు కాలంలో ఉత్పత్తులు గణనీయంగా పెరుగుతాయని అందుకు ప్రజలు అర్థం చేసుకోవాలని, పెరటి తోటలు, న్యూట్రి గార్డెన్స్,మిద్దెలపై పెరటి తోటలు ప్రతి ఒక్కరూ పెంచుకొని ఆరోగ్యంగా ఉండి వైద్య ఖర్చులు తగ్గించుకోవాలని తెలియజేశారు. డాక్టర్ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ చిన్నచిన్న స్టాళ్లు కాకుండా అధిక మొత్తంలో ప్రజల డిమాండ్కు కావలసిన సప్లైని విరివిగా పండించి అందరికీ ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందివ్వాలని, ఇలాంటి కార్యక్రమాలలో మా వంతు సహకారం ఉంటుందని, కెమికల్స్, పురుగుమందులు లేనటువంటి ఆకుకూరలు కాయగూరలు పండిస్తున్న మీరందరికి భవిష్యత్తులో మంచి జరుగుతుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుభాషిని, శాంతి, పర్వీన్, ఫార్మసిస్ట్ శిరీష, ల్యాబ్ టెక్నీషియన్ సురేష్, అటెండర్ గోపాల్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పివి రమణ, భాస్కర్ నాయక్, ఆనంద నాయక్, శంకర్ నాయక్, పి జయలక్ష్మి, వి.జయలక్ష్మి, గంగాభవాని, యశోద, బాదుల్లాబి, శోభ, శోభ రాణి, హరిత, నాగేంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## 12న ఉచిత కంటి వైద్య శిబిరం



**పామిడి-సూర్య వాస్తవం:** పామిడి లో ఈనెల 12వ తేదీ ఆదివారం లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బెంగుళూరు శంకర కంటి ఆసుపత్రి వారు ఉచిత కంటి మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లైన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు మరియు లైన్స్ క్లబ్ అధ్యక్షుడు రఘువీర్ , లైన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు .బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి కంటి వైద్య నిపుణులు కంటి చూపు మందగించిన వారిని పరీక్షించి అవసరమైతే అన్ని రకాల కంటి ఆపరేషన్లకు ఉచిత ముగా ఆపరేషన్లు చేస్తారు .శంకర కంటి ఆసుపత్రి వారు ప్రత్యేక బస్సుల్లో బెంగళూరుకు తీసుకెళ్లి ఆపరేషన్లు అనంతరం తిరిగి గమ్యస్థానాలకు చేరుస్తారని లైన్స్ క్లబ్ సభ్యులు తెలియజేశారు కంటి వైద్య శిబిరానికి హాజరయ్యే వారు రెండు ఆధార్ కార్డు జిరాక్స్ రెండు పాస్పోర్ట్ సైజు ఫోటోలు తీసుకొని రావాలని తెలియజేశారు .ఉచిత కంటి మెగా వైద్య శిబిరాన్ని పామిడి మండల ప్రజలు మరియు పామిడి చుట్టూ ప్రక్కల ఉన్నటువంటి మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ నల్లపాటి తిరుపత నాయుడు, రఘువీర్ కోరారు.

## ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పొందండి

**- ఇంటింటికీ వెళ్లి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు**

**వేంపల్లె - సూర్య వాస్తవం:** వేంపల్లెలోని ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ రవి తెలిపారు. శుక్రవారం ఉర్దూ జూనియర్ కళాశాల అధ్యాపకులు వేంపల్లె పంచాయతీ పరిధిలో ఆయా ప్రాంతాల్లో ఉన్న పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి అడ్మిషన్లుకు చెందిన కరపత్రాలను పంపిణీ చేసి ప్రచార కార్యక్రమం చేపట్టారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అందించే విద్యా బోధనపై అవగాహన కల్పించారు. ఆహ్లాదకరమైన భవనాల్లో విద్యార్థులు ఇంటర్మీడియట్ పూర్తి చేసేందుకు అన్ని సౌకర్యాలు ఉన్నట్లు అధ్యాపకులు తెలిపారు. ఉర్దూ జూనియర్ కళాశాలలో ఎంపిసి, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసి వంటి గ్రూపులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. పదోవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన వెంటనే విద్యార్థులు అడ్మిషన్లు పొందాలని కోరారు. ఉర్దూ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, యూనిఫారం తో పాటు మధ్యాహ్నం భోజన పథకం కూడ ఉన్నట్లు తెలిపారు.

అడ్మిషన్ ఫీజు కూడ తక్కువ అన్నారు. అలాగే విద్యార్థులకు తల్లికి వందనం పథకం కూడ వర్తిస్తుందని చెప్పారు. కార్పొరేట్ కళాశాలకు దీటుగా ఉర్దూ జూనియర్ కళాశాలలో కూడ నాణ్యత గల విద్యా బోధన విద్యార్థులకు అందిస్తున్నట్లు చెప్పారు. ఉర్దూ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పొందేందుకు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ల్యాబ్ సౌకర్యంతో పాటు అన్ని వసతులు ఉన్నట్లు అధ్యాపకులు తల్లిదండ్రులకు తెలిపారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్య అందిస్తున్న ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రచార కార్యక్రమంలో అధ్యాపకులు మహమ్మద్ షరీఫ్, ఫైరోజ్ ఖాన్, ఇర్ఫాన్, బాషా, షఫివుల్లా, ఫక్రుద్దీన్ లు పాల్గొన్నారు.



## అవినాష్ రెడ్డి సత్కారం నాలో సామాజిక బాధ్యతను మరింత పెంచింది

**- ప్రజాసేవలో నా ప్రయాణానికి స్ఫూర్తి వైయస్ కుటుంబీకులే**

**- మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్**



**పులివెందుల- సూర్య వాస్తవం :** ప్రజా ప్రతినిధిగా ప్రజాసేవకుడిగా నా ప్రయాణానికి వైయస్ కుటుంబీకులే స్ఫూర్తిదాయకమని, అభిమాన నేత ఎంపీ అవినాష్ రెడ్డి చే సత్కారం నాలో సామాజిక బాధ్యతను మరింత ప్రేరేపిస్తుందని పులివెందుల పురపాలక మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ సర్పంచులు మరియు కౌన్సిలర్ల సేవలను గుర్తిస్తూ ఎంపీ అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాలు కార్యకర్తలు, నాయకుల పట్ల పార్టీ విధేయత ప్రస్ఫుటమవుతున్నప్పటికీ పార్టీ పట్ల మరియు ప్రజాసేవ పట్ల తమ బాధ్యతను మరింత పెంచుతున్నాయని, ప్రజాసేవ అనే పవిత్ర యజ్ఞంలో ఐదు (5) సంవత్సరాల పాటు మున్సిపల్ చైర్మన్గా నిర్వహించిన నా ప్రజా సేవా ప్రయాణానికి గౌరవప్రదమైన శిఖరంగా నిలిచిన ఈ సన్మానం నా జీవితంలో చిరస్మరణీయమైన మైలురాయిగా నిలుస్తుందని, కడప పార్లమెంట్ సభ్యులు అవినాష్ రెడ్డి చే సత్కారం పొందడం నా జీవితంలో అపూర్వ గౌరవంగా, మరువలేని క్షణంగా భావిస్తున్నానని, ఇది కేవలం ఒక సన్మానం మాత్రమే కాదని నా కృషికి వచ్చిన గొప్ప గుర్తింపు, నాపై ఉంచిన విశ్వాసానికి ప్రతీక, ఈ గౌరవం నాకు మరింత బాధ్యతను గుర్తు చేస్తూ, భవిష్యత్తులో కూడా ప్రజా సేవలలో మరియు సమాజ సేవలో మరింత అంకితభావంతో ముందుకు సాగేందుకు ప్రేరణగా నిలుస్తోందని, ఈ గౌరవాన్ని అందించిన ప్రతి ఒక్కరికీ, ఎప్పుడూ నన్ను ఆదరించిన నా బలగం, నా కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహచరులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని, మీ ఆశీస్సులు, మద్దతు ఎల్లప్పుడూ నాతో ఉండాలని ఆకాంక్షించారు.

## రాయలసీమలో జయంతి వారోత్సవాల జోష్

**- గుత్తిలో భారీగా నిర్వహణ**



**గుత్తి- సూర్య వాస్తవం :** గుత్తి ఎస్సీ,ఎస్టీ, బీసీ,మైనారి టీ మహిళ ఐక్యవేదిక ఆధ్వ ర్యంలో గుత్తి జంగాల కాల నీలో అలాగే రాయలసీమ వ్యాప్తంగా ఛత్రపతి శివాజీ మహారాజు,జ్యోతిబా పూలే, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జ యంతి వారోత్సవాలు ఘనం గా నిర్వహించారు. ఈ కార్య క్రమాన్ని ఐక్యవేదిక వ్యవస్థా పక అధ్యక్షురాలు పట్నం రా జేశ్వరి ఆధ్వర్యంలో తాటికొండ దేవా అధ్యక్షతన నిర్వహిం చారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పట్నం రాజేశ్వరి,రాష్ట్ర అధ్యక్షు రాలు నంది విజయలక్ష్మి హాజరై జయంతి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా భారతీయ భీమ్‌సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జైభీమ్ రామాంజనేయులు, ఎంఆర్పిఎస్-ఎంఎస్పి గుత్తి ఇన్‌చార్జ్ మద్దిలేటి,ఎంఆ ర్పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు,జిల్లా కార్యదర్శి ఈరన్న,బహుజన రాజ్యాధికార జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆ దినారాయణ,బీఎస్పీ నేత గ్రానైట్ రామాంజనేయులు,ప్రగ తిశీల మహిళా అధ్యక్షురాలు ఇంద్రదేవి పాల్గొన్నారు. అదే విధంగా గుత్తి మండల మహిళా అధ్యక్షురాలు తాటికొండ సుం కమ్మ, గార్లదిన్నె మండలం మ హిళా అధ్యక్షురాలు తాటికొం డ కుళ్లాయమ్మతో పాటు పలు వురు నాయకులు,మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై కా ర్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఐసీడీఎస్‌లో ఇద్దరు కాంట్రాక్ట్ ఉద్యోగులకు షోకాజ్




**అనంతపురం- సూర్య వాస్తవం :** అనంతపురంలోని ఐసీడీఎస్ పీడీ కార్యాలయంలోని పోషణ్ అభియాన్ విభాగంలో పని చేసే ఇద్దరు కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఐసీడీఎస్ పీడీ ఎం .శ్రీదేవి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో పురోగతిలో జిల్లా పూర్తిగా వెనుకబడిపోయింది. ఈ అంశాన్ని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి సీరియస్ గా పరిగణించారు. అందుకు బాధ్యులైన పోషణ్ అభియాన్ విభాగపు జిల్లా కో-ఆర్డినేటర్ రఘు, అసిస్టెంట్ కో- ఆర్డినేటర్ షాహీనాకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వీరి నిర్లక్ష్యంతో రాష్ట్రంలోనే అనంతపురం జిల్లా పురోగతిలో వెనుకబడిందని సమాచారం. ఈ విషయంలో పదేపదే హెచ్చరిస్తున్నా కాంట్రాక్ట్ ఉద్యోగులు తమ పని తీరు మార్చుకోకపోవడంతో పీడీ శ్రీదేవి సీరియస్ గా పరిగణించారు. వారిద్దరికీ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మూడ్రోజుల్లోగా సరైన సంజాయిషీ ఇవ్వకపోతే కలెక్టర్ సహా ఐసీడీఎస్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫిర్యాదు చేయనున్నట్లు పీడీ తెలిపారు.

## జిల్లా వ్యాప్తంగా " స్టాప్ మైనర్ డ్రైవింగ్"

**- 128 కేసులు నమోదు...**

**- రూ 21,3505 ఫైన్లు విధింపు...128 వాహనాలు సీజ్**





**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు మైనర్ డ్రైవింగ్‌ను అరికట్టేందుకు ఈరోజు కూడా జిల్లా వ్యాప్తంగా " స్టాప్ మైనర్ డ్రైవింగ్ " కార్యక్రమం నిర్వహించారు. ఈ స్పెషల్ డ్రైవ్ లో భాగంగా... జిల్లా కేంద్రం, అన్ని మున్సిపల్ పట్టణాలు, మండల కేంద్రాలతో పాటు ప్రధాన రహదారులు, తదితర ప్రాంతాలలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. వాహనాలను నడుపుతున్న మైనర్లను గుర్తించి, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. స్టాప్ మైనర్ డ్రైవింగ్ లో భాగంగా శనివారం 128 కేసులు నమోదు... రూ 213505 ఫైన్లు విధింపు...128 వాహనాలు సీజ్ చేశారు.

## మరమ్మతుల కారణంగా తాత్కాలిక విద్యుత్ అంతరాయం



**వేంపల్లె - సూర్య వాస్తవం :** నేడు చక్రాయపేట 220కేవీ ఎస్ఎస్‌లో మెయింటినెన్స్ కారణంగా ఉదయం 5:30 నుండి 7 గంటల వరకు చక్రాయపేట మండలం మొత్తం, పల్లెలంతా కరెంటు ఉండదు.అలాగే వేంపల్లె 132 కె వి ఎస్ ఎస్ లో మెయింటినెన్స్ కారణంగా ఉదయం 8:30 నుండి 10:30 వరకు వేంపల్లె మండలం మొత్తం, పల్లెలుకు కూడా ఎక్కడ కరెంటు ఉండదని డి ఈ ఈ పి. వెంకట నాగేంద్ర తెలియజేశారు. ముందస్తు సమాచారం తెలియజేస్తూ వేంపలే మండల ప్రజలు,చక్రాయపేట మండల ప్రజలు మాకు సహకరిస్తారని తెలియజేశారు.

## వైఎస్సార్ కడప జిల్లా ముస్లిం మైనారిటీ విభాగం వైస్ ప్రెసిడెంట్‌గా షేక్. షబ్బీర్



**వేంపల్లె - సూర్య వాస్తవం :** ప్రజా సంకల్ప జాతీయ వేదికకార్యాలయం స్టేట్ ప్రెసిడెంట్ ముదిరే రంగ సాయి రెడ్డి, (అడ్వొకేట్ )ఆదేశాల మేరకు వైఎస్సార్ కడప జిల్లా మహిళా సాధికార విభాగం ప్రెసిడెంట్, కడప అసెంబ్లీ ఇన్చార్జ్ వీరనాల గృహలక్ష్మి వైఎస్సార్ కడప జిల్లా రాజకీయ విభాగం వైస్ ప్రెసిడెంట్ కే.గంగయ్యా ఆధ్వర్యంలో వైఎస్సార్ కడప జిల్లా ముస్లిం మైనారిటీ విభాగం వైస్ ప్రెసి డెంట్ షైక్. షబ్బీర్‌ను నియమించినట్లు ఒక ప్రకటన విడుదల చేశారాని తెలిపారు. అనంతరం జిల్లా వైస్ ప్రెసిడెంట్ షైక్. షబ్బీర్ మాట్లాడుతూ జిల్లా ముస్లిం మైనారిటీ విభాగం వైస్ ప్రెసిడెంట్ని నియమించేందుకు సహకరిశీచిన జిల్లా మహిళా సాధికార విభాగం ప్రెసిడెంట్, కడప అసెంబ్లీ ఇంచార్జి విరానాలా గృహలక్ష్మి రాయల్ మరియు రాజకీయ విభాగం వైస్సార్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ కే. గంగయ్యాకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను,అలాగే ప్రజా సంకల్ప వేదిక సిద్ధాంతాలకు, నిర్ణయాలకు కట్టుబడి ఉంటానని ప్రజా సమస్యలను ఎప్పటి కప్పుడు ఆయా అధికారుల దృష్టికి ప్రజా సంకల్ప వేదిక ద్వారా తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని తెలియజేశారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS
ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )

# రాయలసీమ ద్రోహి
# మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి
## ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

**శింగనమల - సూర్య వాస్తవం:** రాయలసీమ ప్రజల ఆశలను దెబ్బతీస్తూ, 102 కీలక ప్రాజెక్ట్ పనులను రద్దు చేసిన మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి రాయలసీమకు ద్రోహిగా మిగిలిపోయారని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ తీవ్రంగా విమర్శించారు.గత వైసిపి ప్రభుత్వ హయాంలో జగన్మోహన్ రెడ్డి రాయలసీమ ప్రాజెక్టుకు కేటాయించింది కేవలం 2000 కోట్లు మాత్రమే 2021 లో ఆగిపోయిన రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ను కూటమి ప్రభుత్వం ఎలా ఆపుతుంది కూటమి ప్రభుత్వంపై ఫేక్ ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు కనీసం ఐదు సంవత్సరాల వైసిపి ప్రభుత్వంలో డ్రిఫ్ ఇరిగేషన్ కూడా ఇవ్వని నాయకుడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డివైసీపీ ఐదేళ్ల పాలనలో రాయలసీమ అభివృద్ధి పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, రైతులకు ప్రయోజనం చేకూరే ప్రాజెక్టులను జీఓ 365 ద్వారా ప్రీ-క్లోజర్ చేయడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. గుండ్రేవుల, వేదవతి, ఆర్డీఎస్, బిటి వంటి మొత్తం 102 ప్రాజెక్టులను ఎందుకు రద్దు చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో రూ.12 లక్షల కోట్ల బడ్జెట్‌లో రాయలసీమకు కనీసం రూ.2 వేల కోట్లు కూడా కేటాయించకపోవడం దురుద్దేశపూర్వకమని ఆరోపించారు. రైతులకు ఎంతో ఉపయోగకరమైన డ్రిప్ ఇరిగేషన్ పథకాన్ని రద్దు చేయడం వల్ల ఉద్యానవన రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు విరిగిపోవడం వల్ల 39 మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనపై బాధ్యత ఎవరిదో చెప్పాలని ప్రశ్నించారు. అలాగే హంద్రీనీవా ప్రాజెక్ట్ సామర్థ్యాన్ని పెంచకుండా, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను నిలిపివేయడం వెనుక ఉన్న కారణాలను వెల్లడించాలని కోరారు.మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి అనేకసార్లు ప్రధానిని కలిసినా ప్రాజెక్టులకు అవసరమైన అనుమతులు ఎందుకు సాధించలేకపోయారని ప్రశ్నించారు. రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టుపై స్టే వచ్చిన తర్వాత నాలుగేళ్ల పాటు కౌంటర్ అఫిడవిట్ కూడా వేయకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఇదే సమయంలో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాయలసీమకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి రూ.20 వేల కోట్లకు పైగా ఖర్చు చేసి అనేక ప్రాజెక్టులను పూర్తి చేశారని గుర్తుచేశారు. హంద్రీనీవా, గాలేరు-నగరి వంటి ప్రాజెక్టుల ద్వారా లక్షలాది ఎకరాలకు సాగునీరు అందిందని తెలిపారు.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాయలసీమ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందని, 2026-27 బడ్జెట్‌లో రూ.10,014 కోట్లు కేటాయించడం దీనికి నిదర్శనమని చెప్పారు. హార్టికల్చర్, సోలార్, డ్రోన్ హబ్‌లుగా రాయలసీమను అభివృద్ధి



చేయడానికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని వెల్లడించారు. రాజకీయ లబ్ధి కోసం ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం వైసీపీ నాయకుల లక్ష్యమని, ప్రాజెక్టుల పేరిట అవినీతి చేసి ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.రాయలసీమను రత్నాల సీమగా మార్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన అభివృద్ధి యజ్ఞానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పిలుపునిచ్చారు.

# రామలింగ చౌడేశ్వరి అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు



**పులివెందుల- సూర్య వాస్తవం:** పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లి రోడ్డు చౌడమ్మ వీధిలో కొలువైన శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శుక్రవారము పురస్కరించుకుని ఉదయస్తమాన ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి సుప్రభాత సేవ విశేష పంచామృతాభిషేకం,కుంకుమార్చన ,మహా మంగళహారతి తదితర పూజా కైంకర్యాలు అనంతరం అమ్మవారు విశేష పూల అలంకారంలో చౌడేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.ప్రత్యేకించి ఆలయున ఉదయం 10.30 నిమిషములకు రాహుకాల దీపాలు వెలిగించి రాహుకాల పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు..ఈరోజు కాలాష్టమి సందర్భముగా ప్రత్యేక ఎరుపు రంగు దీపాలు వెలిగించి అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ సందర్భముగా ఆలయ నిర్వాహకులు రాజేంద్రప్రసాద్ ,అర్చకులు ప్రవీణ్ స్వామి మాట్లాడుతూ ప్రతి శుక్ర,పౌర్ణమి,అమావాస్య రోజున అమ్మవారికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి చీర వడిబయ్యము,కుంకుమార్చన,బోనాలు సమర్పించి తమ మొక్కలు చెల్లించుకోవడం జరుగుతుందన్నారు.ప్రత్యేకించి ఆది,మంగళ,శుక్రవారములు,పౌర్ణమి,అమావాస్య రోజున అమ్మవారికి 108 ప్రదక్షిణములు చేసి నమస్కరించిన యెడల కోరిన కోరికలు తీరుతాయని భక్తుల అపారమైనటువంటి నమ్మకము.ఆలయ ప్రాంగణం మొత్తము అమ్మవారి నామస్మరణతో మార్మోగాయి.అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసినటువంటి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు..ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ,భక్తులందరూ పాల్గొన్నారు

# భక్తిశ్రద్ధలతో భ్రమరాంభిక దేవికి కలిశాభిషేకం

## ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చిన భ్రమరాంబికా దేవి

**వేముల - సూర్య వాస్తవం:** వేముల మండలంలో మబ్బు చింతలపల్లి లో కొలువై ఉన్న శ్రీ భ్రమరాంబికా దేవి ఆలయంలో శుక్రవారం పురస్కరించుకొని ఉదయాస్తమాన గురుస్వామి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి 108 బిందెల కలిశా పూజ పంచామృత అభిషేక కైకరియాలు కుంకుమార్చన కార్యక్రమాలు వేదమంత్రోచారనతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం పురస్కరించుకొని అమ్మవారి ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని విశేష పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గురుస్వామి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ఎంతో మహిమగల భ్రమరాంబిక దేవి ఆలయానికి భక్తులు తండోప తండాలుగా వచ్చి అమ్మవారికి మహా నైవేద్యం కాయ కర్పూరాలు సమర్పించి విశేష పూజ నిర్వహించే అమ్మవారు ఆశీస్సులు పొందడం జరిగిందని, సాయంకాల సమయాన 108 దీపాలంకరణ పల్లకి సేవ విశేష పూజలు





నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు

### అకాల వర్షాలతో నష్టపోయిన
# అరటి రైతులకు నష్టపరిహారం అందించాలి

**టిడిపి సీనియర్ నాయకుడు మద్దూరు వెంకట రామిరెడ్డి**

**పులివెందుల - సూర్య వాస్తవం:** అకాల వర్షాలు, గాలివానల కారణంగా పంట నష్టపోయిన అరటి రైతులకు తక్షణమే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని పులివెందుల పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మద్దూరు వెంకట రామిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు ఆయన ఒక వినతి పత్రాన్ని అందజేశారు.2024-2025 సంవత్సరంలో మే 12,13 తేదీలలో కురిసిన అకాల



వర్షాలకు పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 314 మంది రైతులకు చెందిన 233.75 ఎకరాల్లో అరటి పంట పూర్తిగా దెబ్బతిన్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు.ఈ పంట నష్టంపై గతంలోనే (04.08.2025) ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును తెలిపారు. అప్పట్లో స్పందించిన ముఖ్యమంత్రి ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే నష్టపోయిన రైతులకు భరోసా కల్పిస్తూ నష్టపరిహారం విడుదల చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

### రాయలసీమ లిఫ్టును త్వరితగతిన పూర్తి చేసిన తర్వాతనే
# అమరావతి గురించి మాట్లాడండి
### మాజీ మంత్రి సాకే శైలజానాథ్





**శింగనమల - సూర్య వాస్తవం:** రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు సమాలోచన పేరుతో అనంతపురంలోని గుత్తిరోడ్డులో ఉన్న కేటీఆర్ ఫంక్షన్ హాల్‌లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగింది. రాయలసీమ ఎత్తిపోతల పథకం ఆవశ్యకతతో పాటు హంద్రీనీవా ప్రధాన కాలువ వెడల్పుతో జరిగే ప్రయోజనాలు, ఇతర అంశాలపై చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా శైలజానాథ్ మాట్లాడుతూ రాయలసీమలో పూర్తి కావాల్సిన ప్రాజెక్టులు పూర్తి చేసి రాయలసీమ ప్రజలకు సమాధానం చెప్పిన తర్వాతనే అమరావతి అభివృద్ధి గురించి మాట్లాడలాని సూచించారు. అలానే అన్ని నేనే చేశా అని చెప్పుకునే ముఖ్యమంత్రి చంద్రబాబు రాయలసీమ ప్రజల గొంతు తడిపే ఆల్మట్టి ఎత్తును తగ్గించే బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్‌రెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ సాకే శైలజానాథ్, పార్టీ పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు తలారి రంగయ్య, మెట్టు గోవిందరెడ్డి, వై.వెంకట్రామిరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మంజునాథ్ యాదవ్, అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకులు, పీఏసీ, సీఈసీ, ఎస్ఈసీ సభ్యులు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, పార్టీ రాష్ట్ర, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, అనుబంధ విభాగాల కమిటీ సభ్యులు, జిల్లా పార్టీ కమిటీ సభ్యులు, నగర, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు ఇతర వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### ఇంటి పన్ను రశీదుల్లో
# యజమానుల పేర్లు నమోదు చేయాలి
### - మున్సిపల్ శాఖ మంత్రికి విన్నపం



**పులివెందుల- సూర్య వాస్తవం:** పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో నివసిస్తున్న గృహ యజమానుల పేర్లను ఇంటి పన్ను రశీదుల్లో అధికారికంగా నమోదు చేయాలని కోరుతూ గౌరవ మున్సిపల్ శాఖ మంత్రి వర్యులకు వినతి పత్రం సమర్పించారు.?పులివెందుల మున్సిపాలిటీలోని 33వ వార్డు అనేకమంది గృహ యజమానులు సుమారు 20 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ఇంటి పన్నులు చెల్లిస్తున్నారు.?అయినప్పటికీ,వారి ఇంటి పన్ను రశీదుల్లో యజమాని పేరు ఉండాల్సిన చోట ది హోల్డర్ అఫ్ ది ప్రేమిసెస్ అని నమోదవుతోందని,?ఈ విషయమై స్థానిక మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించగా, రశీదుల్లో పేరు నమోదు కావాలంటే రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు తప్పనిసరి అని అధికారులు పేర్కొంటున్నారు.?అయితే,సదరు ప్రాంతాల్లోని ఇళ్లు ప్రభుత్వం గతంలో పేదలకు అందించిన వీకర్ సెక్షన్ లేఅవుట్ లో భాగంగా ఉండటంతో,చాలామంది వద్ద రిజిస్టర్డ్ పత్రాలు లేని పరిస్థితి నెలకొందన్నారు.?ఈ సమస్యను మానవతా దృక్పథంతో పరిశీలించి,ఏళ్ల తరబడి పన్నులు చెల్లిస్తున్న యజమానుల పేర్లను నేరుగా రశీదుల్లో నమోదయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని పులివెందుల పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు మంత్రి ని కోరారు.

## జడ్పీ షాపింగ్ గదులను పరిశీలించిన సిఇఓ

**వేంపల్లె సూర్య వాస్తవం:** స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న జడ్పీ షాపింగ్ గదులను జడ్పీ సిఇఓ రామచంద్రారెడ్డి పరిశీలించారు. శుక్రవారం జడ్పీ సిఇఓ రామచంద్రారెడ్డి, డిప్యూటీ సిఇఓ సుబ్రహ్మణ్యంలు వేంపల్లెలోని ఎంపిడిఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈనేపథ్యంలో స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న జడ్పీ గదులను పరిశీలించి వ్యాపారస్తులతో సమస్యలపై ఆరా తీశారు. అలాగే జడ్పీ షాపింగ్ కాంప్లెక్స్ లో ఖాళీగా ఉన్న గదులకు త్వరలో వేలం పాటలు వేస్తామని జడ్పీ సిఇఓ రామచంద్రారెడ్డి తెలిపారు. రోడ్డు పనులు జరుగుతున్న కారణంగా వ్యాపారాలు లేవని ఇబ్బందిగా ఉందని కాబట్టి బాడుగలు తగ్గించాలని షాపింగ్ కాంప్లెక్స్ లోని వ్యాపారులు కోరారు. దీంతో అధికారులతో చర్చించి తగు న్యాయం చేస్తామని సిఇఓ హామీ ఇచ్చారు. పెండింగ్ బాడుగలు సకాలంలో చెల్లించాలని వ్యాపారస్తులను జడ్పీ సిఇఓ కోరారు. ఈయన వెంట డిప్యూటీ సిఇఓ సుబ్రహ్మణ్యం, ఎంపిడిఓ కుళాయమ్మ, పంచాయతీ కార్యదర్శి నాగభూషణంరెడ్డి పాల్గొన్నారు.